


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 05 మార్చి 2022 సంపుటి: 03 సంచిక: 178 పేజీలు: 4 వెల: రూ 3-00


## ఉక్రెయిన్ నుంచి భారతీయుల తరలింపుపై మోదీ సమీక్ష



న్యూఢిల్లీ : యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్ నుంచి భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు చేపట్టిన 'ఆపరేషన్ గంగ' కార్యక్రమం పురోగతిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్షించారు. ఈ అంశంపై మోదీ నిర్వహించిన ఎనిమిదో సమావేశమిది. కీవ్ నగరంలో ఓ భారతీయ విద్యార్థిపై కాల్పులు జరిగిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. కేంద్ర మంత్రి జనరల్ వీకే సింగ్ తెలిపిన వివరాల ప్రకారం, కీవ్ నగరంలో ఓ భారతీయ విద్యార్థిపై కాల్పులు జరిగాయని, ఆయనను ఆసుపత్రిలో చేర్పించి, చికిత్స చేయిస్తున్నారని తెలుస్తోంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి మోదీ వరుసగా ఉన్నత స్థాయి సమావేశాలను నిర్వహిస్తున్నారు. రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీలతో మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్‌లో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు 'ఆపరేషన్ గంగ'ను నిర్వహిస్తున్నారు. ఉక్రెయిన్‌కు పొరుగున ఉన్న నాలుగు దేశాలకు విమానాలను పంపించి, అక్కడి నుంచి భారతీయులను ఉక్రెయిన్ నుంచి తీసుకొస్తున్నారు. ఈ నాలుగు దేశాల నుంచి భారతీయులను రప్పించే కార్యక్రమాన్ని నలుగురు కేంద్ర మంత్రులు పర్యవేక్షిస్తున్నారు. గురువారం రాత్రి భారత వాయు సేనకు చెందిన మూడు సీ-17 విమానాల్లో 630 మంది హిందోన్ వైమానిక స్థావరానికి చేరుకున్నారు. రొమేనియా, హంగరీల నుంచి ఈ విమానాలు వచ్చాయి. ఇప్పటి వరకు ఉక్రెయిన్ నుంచి భారత దేశానికి చేరుకున్నవారి సంఖ్య 9,000కు చేరుకున్నట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.

## మాట నిలబెట్టుకుంటాం: సీఎం వైఎస్ జగన్



పశ్చిమగోదావరి: ఆంధ్రప్రదేశ్‌కు పోలవరం ప్రాజెక్టు జీవనాడి అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పునరావాస పనులపై అధికారులు మరింత దృష్టి పెట్టాలని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులతో పాటు పునరావాస కాలనీలను కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో కలిసి ఆయన శుక్రవారం సందర్శించారు. క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు. అనంతరం ఇందుకూరు నిర్వాసితులతో సీఎం జగన్, కేంద్రమంత్రి షెకావత్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ, పోలవరం పూర్తయితేనే ఏపీ సస్యశ్యామలం అవుతుందన్నారు. నిర్వాసితులకు కేంద్ర సాయంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సాయం అందిస్తుందని, వారి జీవనోపాధిపై కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో రూ.6.8 లక్షల నుంచి 10 లక్షలు ఇస్తామన్న మాట బెట్టుకుంటామన్నారు. వైఎస్ హయాంలో భూసేకరణలో ఎకరం లక్షన్నరకే ఇచ్చిన వారికి రూ.5 లక్షలు ఇస్తామని సీఎం వైఎస్ జగన్ తెలిపారు.

## మూడు రాజధానులకు కట్టుబడి ఉన్నాం...సుప్రీంకు వెళ్తాం : హోంమంత్రి సుచరిత

గుంటూరు: మూడు రాజధానులకు కట్టుబడి ఉన్నామని హోంమంత్రి సుచరిత స్పష్టం చేశారు. అభివృద్ధి వికేంద్రీకరణ తమ విధానమని... అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నారు. రాజధానిపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లనున్నట్లు



తెలిపారు. రాజధాని ఎక్కడుండాలన్న అంశం రాష్ట్ర పరిధిలోనిదేనని కేంద్రం చెప్పిందని గుర్తుచేశారు. రాజధానిపై శాసన నిర్ణయాధికారం లేదని కోర్టు చెప్పినట్లు తెలిపారు. అమరావతి ప్రాంతం శాసన రాజధానిగా ఉంటుందన్నారు. మొత్తం తరలిస్తున్నట్లు అసత్య ప్రచారం చేస్తున్నారని... రాజధానిపై ప్రభుత్వానికి స్పష్టత ఉందని హోంమంత్రి సుచరిత పేర్కొన్నారు.

## ఏపీ రాజధాని విషయంలో పకడ్బందీ తీర్పు వచ్చింది: రఘురామ



అమరావతి: ఏపీ రాజధాని అంశంలో పకడ్బందీ జడ్జిమెంట్ వచ్చిందన ఎంపీ రఘురామ క'ష్ణం రాజు పేర్కొన్నారు. ఏపీలో దళితులపైనే అట్రాసిటీ కేసులు నమోదు చేశారని ఆయన ఆరోపించారు. రాజధాని మార్పుపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని, పార్లమెంట్ మాత్రమే నిర్ణయం తీసుకుంటుందని ఆయన అన్నారు. హైకోర్టు తీర్పుపై హోంమంత్రి సుచరిత వ్యాఖ్యలు సరైన విధంగా లేవని రఘురామ ఆరోపించారు. ఇక రాజధాని విషయం పై సుప్రీంకోర్టుకు వెళ్లినా లాభం లేదని, ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయంలో కోర్టు చెంప దెబ్బలు వేస్తోందని ఎద్దేవా చేశారు. రాజధాని విషయంలో జగన్ నిర్ణయం దారుణంగా వుందని రఘురామరాజు ఆరోపించారు. సీఎం పదవికి జగన్ రాజీనామా చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీ రద్దు చేసి జగన్ ఎన్నికలకు వెళ్లాలి. తనను కొందరు రాష్ట్రానికి రానివ్వడం లేదని ఆయన ఆరోపించారు. అందుకే రాష్ట్రంలో తీసుకుంటున్న తప్పుడు నిర్ణయాలపై లేఖలు రాస్తున్నానని అన్నారు. తన పార్టీ సభ్యులు నాపై అనర్హత వేటు వేయిస్తా అంటేనే ఛాలెంజ్ చేశానని చెప్పారు. ఆర్థిక ఎమర్జెన్సీని ప్రకటిస్తే ప్రభుత్వం రద్దవుతుందని రఘురామరాజు ఆరోపించారు. సీబీఐ నోటీసులు ఇస్తే అవినాష్ రెడ్డి తీసుకుంటారు. సీఐడీ అంత కక్ష్య పూరితంగా వ్యవహరించదని అన్నారు

## రాజధానిని నిర్ణయించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదే : బొత్స

రాజధానిని నిర్ణయించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదేనని మంత్రి బొత్స సత్యనారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టుకు అప్పీలుకు వెళ్లాలా..?లేదా..? అని ఆలోచన చేస్తామని.. అప్పీలుకు వెళ్లాల్సిన అవసరం ఏముంది..? అని ఫైర్ అయ్యారు. మూడు రాజధానులకు కట్టుబడి ఉన్నామని.. రాజధాని అభివృద్ధి అంశం సమయం, ఖర్చు, నిధులతో ముడిపడి ఉన్నాయని తెలిపారు. అభివృద్ధి విషయంలో వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటామని.. ప్రస్తుతం సీఆర్డీఏ చట్టం అమల్లో ఉంది.. దీన్ని డీవియేషన్ చేసి ఎలా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. రాజధానిపై మా విధానం మాకు ఉందని.. అభివృద్ధి అనేది వ్యక్తుల కోసం కాదు.. వ్యవస్థ కోసం చేయాలని వెల్లడించారు. రాజధానిలో డెవలప్మెంట్ చేస్తున్నాం.. ఎక్కడా డీవియేట్ కావడం లేదని.. అభివృద్ధి వికేంద్రీకరణే మా ప్రభుత్వ విధానం.. దానికి కట్టుబడి ఉన్నామన్నారురైతులకు చేయాల్సినవన్నీ చేస్తున్నాం.. రైతులకు సీఎం ఎందుకు క్షమాపణ చెప్పాలని.. మేము ఎక్కడా రాజధాని భూములను ఇతర అవసరాల కోసం ఎక్కడా తనాఖా పెట్టలేదని స్పస్టం చేశారు. రాజధాని అభివృద్ధి కోసమే రాజధాని లోని భూములను హడ్కోకు తాకట్టు అని.. రాజధాని భూములను చంద్రబాబు హయాంలోనే తనాఖా పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసన సభ సమావేశాల్లో బిల్లు పెడతామో లేదో అనేది మీరే చూస్తారని.. రాజధానిపై చట్ట పరంగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని ప్రకటన చేశారు.



## వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలమైన పునాది: విజయసాయిరెడ్డి



అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, అనుబంధ విభాగాల ఇన్‌ఛార్జ్, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో విజయసాయిరెడ్డి శుక్రవారం సమావేశమయ్యారు. పార్టీ బలోపేతంపై వారితో చర్చించి పలు సూచనలు చేశారు. వారికి దిశానిర్దేశం చేశారు. 2019 ఎన్నికల నాటికంటే వైఎస్సార్‌సీపీకి మరింతగా ఆదరణ పెరిగిందని విజయసాయిరెడ్డి అన్నారు. "ప్రతి ఎన్నికలోనూ ప్రజలు వైఎస్సార్‌సీపీని గెలిపించారు. సీఎం వైఎస్ జగన్ విధానాలతో ప్రజలలో పెరిగిన విశ్వాసమే కారణం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమైన పునాది. పార్టీ అనుబంధ సంఘాలు మరింత బలంగా పనిచేయాలి. తెలుగుదేశం పార్టీ దుష్ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని.. దీన్ని తిప్పికొట్టాలని" విజయసాయిరెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్ సూచనల మేరకు క్షేత్రస్థాయిలో ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాల ప్రకారం ముందుకెళ్లాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ భేటీలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జ్ లేళ్ల అప్పిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, చల్లా మధుసూదన్‌రెడ్డి, గౌతంరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, మేరుగ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి వర్ష సూచన

### పుదుచ్చేరి హార్బర్‌లో ఒకటో నెంబరు హెచ్చరిక

ప్యారీస్(చెన్నై): బంగాళాఖాతంలో కేంద్రీకృత మైన అల్పపీడనం క్రమక్రమంగా వాయుగుండంగా బలపడే అవకాశమున్నందు వల్ల తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో శుక్రవారం నుంచి మూడు రోజులు భారీవర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం ప్రకటించింది. పుదుకోట, కడలూరు, రామనాథపురం డెల్టా జిల్లాల్లో భారీ, అతి భారీ వర్షాలు, ఇతర జిల్లాల్లో చిన్నపాటి వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. అదే విధంగా కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలోని కారైక్కాల్ హార్బర్‌లో గురువారం ఉదయం ఒకటో నెంబరు తుఫాను హెచ్చరి కను ఆ ప్రభుత్వం జారీచేసింది. ఈనేపథ్యంలో, వాతావరణంలో మార్పుల కారణంగా సంభవించే తుఫానుల నుంచి ప్రజలను కాపాడేలా



ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఈ రెండు రాష్ట్రప్రభుత్వాలు కలెకర్లకు ఉత్తర్వులు జారీచేశాయి. నాగపట్టణం, మైలాడుదురై, కడలూరు, తంజావూరు, తిరువారూరు, పుదుకోట, అరియలూరు, పెరంబలూరు, కళ్లకుర్చి, విల్లుపురం, చెంగల్పట్టు, చెన్నై జిల్లాలకు చెందిన జాలర్లు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించారు.

## ఏపీలో జరుగుతున్న అన్ని తప్పులకు నేనే కారణమంటూ?: చంద్రబాబు



అమరావతి: ఏపీలో జరుగుతున్న అన్ని తప్పులకు తానే కారణమంటున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ వైఎస్ వివేకానంద రెడ్డిని చంపి గుండెపోటు అని ప్రచారం చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలకు వాస్తవాలు చెప్పి వైసీపీని ఓడిస్తామన్నారు. సానుభూతితో జగన్ ఓట్లు వేయించుకున్నారన్నారు. వివేకా హత్య, కోతి కత్తితో సానుభూతి పొందారని, ఇప్పుడు కోడి కత్తి ఎక్కడుందో చెప్పాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. పోలవరాన్ని పరిగెత్తించి 72 శాతం పూర్తి చేశామని చంద్రబాబు తెలిపారు. టీడీపీ ప్రభుత్వం ఉంటే ఈపాటికి 100 శాతం పూర్తయ్యేదన్నారు. అవినీతి, అబద్దాల పుట్టా వైసీపీ అని దుయ్యబట్టారు. పోలవరంలో అవినీతికి పాల్పడ్డామన్నారు.. నిరూపించారా? అని ప్రశ్నించారు. అభివృద్ధి చేతకాని సీఎం దాని గురించి మాట్లాడతారని అన్నారు. ప్రాంతాలను రెచ్చగొట్టి ఓట్లు వేయించుకుంటారా?.. ఓట్ల కోసం ప్రాంతాలు, కులాలు, మతాలను రెచ్చగొడతారా? అంటూ మండిపడ్డారు. తెలుగువారంతా తమ కుటుంబ సభ్యులేనని, తెలుగువారే తన కులం, మతం అని చంద్రబాబు అన్నారు. పేటీఎం బ్యాచ్‌ను అడ్డుపెట్టుకుని టీడీపీపై విషప్రచారం చేశారని చంద్రబాబు విమర్శించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. ప్రజల కష్టాలను వెలుగులోకి తేవాల్సిన బాధ్యత ఐటీడీపీ సభ్యులపై ఉందన్నారు. ఐటీడీపీ సభ్యులపై ఎన్నో అక్రమ కేసులు పెట్టారని, భయపడకుండా ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. టీడీపీ అధికారంలోకి రాగానే అక్రమ కేసులను రద్దు చేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

## 10 వేల రష్యన్ సైన్యం, 250 ట్యాంకులు మట్టుబెట్టాం: ఉక్రెయిన్

కీవ్: రష్యాకు చెందిన 10 వేల మంది సైనికులు, 251 యుద్ధ ట్యాంకులను మట్టుబెట్టామని ఉక్రెయిన్ పేర్కొంది. శుక్రవారం ఉక్రెయిన్ సైన్యం స్పందిస్తూ మార్చి 4 వరకు తమ దేశంలో ప్రవేశించిన రష్యన్ దళాలపై దాడికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం.. 9,166 మంది రష్యాన్ సైనికులను ఉక్రెయిన్ మట్టుబెట్టింది. అలాగే 50 ఎంఎల్ఆర్ఎస్ వాహనాలు, 33 వార్ ప్లేన్లు, 37 హెలికాప్టర్లు, 404 కార్లు, 2 బోట్లు, 251 యుద్ధ ట్యాంకులు, 60 ఇంధన వాహనాలు, 105 ఆర్టిలరీ పీసెస్, 3 యూఏవీలు, 939 ఆర్మ్‌డ్ పర్సనల్ వాహనాలు, 18 ఆంటీ ఎయిర్‌క్రాఫ్ట్ వార్‌ఫేర్‌లు ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఉక్రెయిన్‌పై దురాక్రమణ ప్రారంభమై వారం రోజులు గడిచాక.. రష్యాకు ఎదురుదెబ్బలు మొదలయ్యాయి. రష్యా దళాలు తమ సరిహద్దు నుంచి 500 కిలోమీటర్లు దాటి కీవ్ నగరానికి 25 కిలోమీటర్ల దూరంలో బస చేశాయి. కానీ, ముందుకు సాగలేకపోతున్నాయి..! కారణం.. వేల మంది సైనికులకు ఆహారంఅందక అలమటిస్తున్నారు. వందల యుద్ధ ట్యాంకుల్లో ఇంధనం అయిపోయింది. దీంతో.. ఒకే చోట పెద్ద సంఖ్యలో సైనికులు, యుద్ధ ట్యాంకులు నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా.. రష్యా సైనికుల తాజా దాడిలో యూరప్‌లోనే అతిపెద్ద న్యూక్లియర్ ప్లాంట్ ధ్వంసం అయినట్లు తెలుస్తోంది. రష్యా సైనికులు ఈ విషయాన్ని స్పష్టం చేశారు.



# సంపాదకీయం

శనివారం 05 మార్చి 2022

## యూపీలో మారుతున్న సమీకరణాలు

భారత రాజకీయాల్లో ఒక మాట చాలా ప్రసిద్ధి. అదేంటంటే ఢిల్లీ రహదారి లక్నో నుంచే వెళుతుంది అని. దాని ప్రకారం ప్రస్తుత ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలను నిర్ణయిస్తాయని. ఇంకో మాటలో చెప్పాలంటే యూపీని గెలవకుండా ఢిల్లీని గెలవలేరని అర్థం.ప్రజాభిప్రాయం ప్రకారం.. ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ, ఎస్పీ మధ్యనే ప్రధాన పోటీ. బీజేపీ జాతీయ ప్రత్యామ్నాయం కాంగ్రెస్‌కు పెద్ద పాత్ర ఉండకపోవచ్చు. ఆ పార్టీకి ఒక్క సీటు కూడా రాదని ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ హేళన కూడా చేశారు. అయినా.. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ తన ప్రయత్నం తాను చేస్తున్నారు. బహుశా ఆమె లక్ష్యం ఈ అసెంబ్లీ ఎన్నికలు కాకపోవచ్చు. 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి కాంగ్రెస్ పార్టీకి పునర్వైభవం తీసుకురావాలని అనుకుంటున్నారామె. నిజానికి కాంగ్రెస్ పునరుత్థానం కోసం ప్రియాంక తన వ్యూహాలను ఈ అసెంబ్లీ ఎన్నికలలో అమలు చేస్తున్నారు. అయితే గత 25 సంవత్సరాలలో యూపీ కాంగ్రెస్ క్రమానుగత పతనాన్ని మాత్రమే చూసింది. మరి దీనిని ప్రియాంక అధిగమిస్తారా? 1985 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ 269 సీట్లతో అధికారం చేపట్టింది. అప్పుడు బీజేపీ సాధించింది కేవలం 16 స్థానాలు. అంతకు ముందు 1984 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 85 స్థానాలను హస్తం పార్టీ స్వీప్ చేసింది. దాంతో పాటు అత్యంత కీలకమైన హిందీ రాష్ట్రాలలో తిరుగులేని ఆధిపత్యం సాధించింది. అదే సమయంలో అది కొన్ని స్వయంకృతాపరధాలు చేసింది. తద్వారా స్వీయనాశనాన్ని కొని తెచ్చుకుంది. షా బానో కేసు, సల్మాన్ రష్దీ పుస్తకంపై నిషేధం, శిలాన్యాస్ కోసం అయోధ్య తలుపులు తెరవడం వంటి రాజకీయ తప్పులకు పాల్పడి యూపీ అనే బంగారు కానుకను వెండి పళ్ళెంలో పెట్టి బీజేపీకి అప్పగించింది. 1984లో 404 లోక్‌సభ స్థానాలు గెలిచిన కాంగ్రెస్ పార్టీ బలం 1989 ఎన్నికల నాటికి 207 స్థానాలకు పడిపోయింది. దాంతో 1991 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 221 సీట్లు గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం ఎవరినీ ఆశ్చర్యపరచలేదు. కేవలం ఆరేళ్లలో కాంగ్రెస్ ఆవిరైపోయింది. 46 సీట్లకు పరిమితమైంది. అంటే 1985 నుంచి 91 వరకు 83 శాతం పతనమైంది. అదే సమయంలో బీజేపీ బలం 14 రెట్లు పెరిగింది. 1984లో కేవలం రెండు లోక్‌సభ స్థానాలు గెలిచిన బీజేపీ 1989 నాటికి 85 సీట్లకు ఎగబాకింది. ఇదంతా నాడు రాజీవ్ గాంధీ తప్పులకు కాంగ్రెస్ చెల్లించిన మూల్యం. అప్పటి నుంచి ఇప్పటి వరకు హస్తం పార్టీ పతనం అంచెలంచెలుగా కొనసాగుతూనే ఉంది. మరోవైపు దీనికి విరుద్ధంగా బీజేపీ అంచెలంచెలుగా ఎదుగుతూనే ఉంది. 2009లో 116 స్థానాలు గెలిచిన బీజేపీ 2014లో 282 సీట్లు గెలిచి పూర్తి మెజార్టీ సాధించింది. అంటే దాని వృద్ధి రేటు 143 శాతం. అదే సమయంలో 2009లో 206 స్థానాలు గెలిచిన కాంగ్రెస్ బలం 2014 నాటికి 44 సీట్లకు పరిమితమైంది. 2019లో కూడా దానిని పరిస్థితి ఏమీ మారలేదు. కానీ బీజేపీ తన సంఖ్యను 303కి పెంచుకుంది. బీజేపీ దూకుడుగా అనుసరిస్తున్న కమ్యునల్ పోలరైజేషన్, భారీ ప్రచారం, ఓటర్ల సమీకరణ, ఆకట్టుకునే ప్రసంగాలు దాని ఎదుగుదలకు దోహదం చేశాయి. కానీ, కాంగ్రెస్ ఓటమి కథ మరీ విచిత్రం అనిపిస్తుంది. దాని పరిస్థితి హెడ్‌లైట్లకు ఆగిపోయిన జింకలా అనిపిస్తుంది. గత రెండు సార్వత్రిక ఎన్నికల్లో యూపీ నుంచి బీజేపీ వరసగా 71, 62 స్థానాలు దక్కించుకోగా కాంగ్రెస్ 2, 1 సీట్లలో గెలిచింది. ఒక్కసారి అధికారం చేజారితే దానిని తిరిగి దక్కించుకోవటం కాంగ్రెస్‌కు కష్టంగా మారింది. వాస్తవానికి ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పతనం రాత్రికి జరిగింది కాదు. 1996 నుంచి దాని ఓట్ల శాతం సింగిల్ డిజిట్‌కే పరిమితం. గత పాతిక సంవత్సరాలలో యూపీలో అది అత్యధికంగా 1996లో 33 లోక్‌సభ సీట్లు గెలుచుకుంది. ఆ తర్వాత 2009లో 22 సీట్లు సాధించింది. ఇంతకు మించి ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రదర్శన గొప్పగా లేదు. కాంగ్రెస్ పార్టీ 2014 లోక్‌సభ ఎన్నికలలో కేవలం 44 స్థానాలకు పరిమితం అయింది. అలాగే 2019లో 52 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. బీజేపీ విషయం ఇందుకు పూర్తిగా భిన్నం. 1991లో యూపీ అసెంబ్లీలో 221 సీట్ల నుంచి, 2002లో 88కి, 2007లో 51కి, 2012లో 47కి పడిపోయినా ఏనాడూ అది పూర్తిగా కూలిపోలేదు. ప్రతి ఎన్నికల్లో కనీసం 15-17 శాతం మధ్య ఓటు షేర్ సాధిస్తూ వచ్చింది. 2017లో 312 సీట్లతో అద్భుత విజయం సాధించటానికి పునాది ఆ ఓట్లే. అదే సమయంలో కాంగ్రెస్ నిర్లక్ష్యం యూపీ కాంగ్రెస్‌లో తీవ్ర నిరాశను మిగిల్చింది. కార్యకర్తలను తీవ్రంగా కుంగదీసిన పాపం పార్టీదే. యూపీ మాత్రమే కాదు జాతీయంగా కూడా కాంగ్రెస్ తీరు ఇప్పటికీ మారలేదు. యూపీ గణాంకాలు చెబుతున్నట్టుగా ఓటమి తరువాత కాంగ్రెస్ తనను తాను పెంచుకునే బదులు పూర్తిగా తుడిచిపెట్టుకుపోతోంది. ఈశాన్య రాష్ట్రాలు, గుజరాత్, యూపీ, బీహార్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఒడిశాలో నేడు కాంగ్రెస్ పరిస్థితి అందుకు ఉదాహరణ. సుదీర్ఘ కాలంగా సాగుతున్న ఈ పతనానికి కాంగ్రెస్ వద్ద హేతుబద్ధంగా సమర్థించుకోలేదు. కాంగ్రెస్‌కు భిన్నంగా బీజేపీ పరాజయం పాలైనప్పుడు కుంగిపోలేదు. 1991 నుంచి దాని అతితక్కువ లోక్‌సభ సీట్లు 116. కాంగ్రెస్ తనను తాను నిర్మూలించుకుంటుండగా, బీజేపీ తనను తాను తిరిగి ఆవిష్కరించుకుంటోంది. ఢిల్లీనే ఉదాహరణగా తీసుకుంటే షీలా దీక్షిత్ హయాం ముగిసిన తరువాత అక్కడ కాంగ్రెస్ ఘోరంగా పతనమైంది. ప్రస్తుత ఢిల్లీ అసెంబ్లీలో దానికి ఒక్క సీటు కూడా లేని దుస్థితి. ఒకవేళ ఈ అసెంబ్లీ ఎన్నికలలో ఎస్పీ చేతిలో బీజేపీ దెబ్బతిన్నదే అనుకుందాం. అయినా 2024లో దాని గెలుపు అవకాశాలకు వచ్చిన ప్రమాదం ఏమీ ఉండకపోవచ్చు. ఎందుకంటే లోక్‌సభ ఎన్నికలను రెండు జాతీయ పార్టీల మధ్య పోరాటంగా ప్రజలు చూస్తారు. ప్రస్తుతం యూపీలో కాంగ్రెస్.. బీజేపీ మధ్య పోలికే లేదు. మరి ప్రియాంకా గాంధీ ఎందుకు 2024 లోక్‌సభ ఎన్నికలకు బలహీన కాంగ్రెస్‌ను సిద్ధం చేయటానికి అంతలా శ్రమిస్తున్నారు? బహుశా 1977లో 153 నుంచి 1980లో 353 స్థానాలకు చేర్చిన ఇందిరాగాంధీ స్ఫూర్తి కావచ్చు. మరోవైపు, బీజేపీ తన అనైతిక 'సామ, దాన, దండ్, భేద్' రాజకీయాలకు తగిన మూల్యం చెల్లించే అవకాశమూ లేకపోలేదు. రాజ్యాంగ సంస్థలను నీరుగార్చిందన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రజాస్వామ్య విలువలను గంగలో కలిపిందన్న అపప్రథను మోస్తోంది.

# కడప టీడీపీకి దిక్కెవరు..?

కడప, మార్చి 4,కడప జిల్లాలో టీడీపీకి ఆశాకిరణాలు ఎవరైనా కనిపిస్తారా ? అన్న ప్రశ్నకు టీడీపీ వాళ్లే ఆన్సర్ చెప్పే పరిస్థితి లేదు. గత 20 ఏళ్లలో ఆ పార్టీ కడపలో సాధించిన అతిపెద్ద విజయం ఏంటంటే ఒక్క అసెంబ్లీ సీటే.. ఓ సారి కమలాపురంలో మాత్రమే గెలిస్తే.. 2009లో ప్రొద్దుటూరులో గెలిచింది. అది కూడా జగన్ వరదరాజుల రెడ్డిపై కోపంతో చేసిన పనే ఇది అంటారు కూడా. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చినా రాజంపేట మాత్రమే గెలిచింది.. గత ఎన్నికల్లో అది పోయింది. సున్నా మిగిలింది. ఇక రెండు ఎంపీ సీట్లు అయిన కడప, రాజంపేటలో గెలిచి 20 ఏళ్లు దాటుతోంది. ఇది కడపలో స్థూలంగా టీడీపీ డిజాస్టర్ హిస్టరీ. అలాంటిది ఇప్పుడు కడప జిల్లాలో టీడీపీకి కొందరు యువనేతలు పెద్ద ఆశాకిరణాలుగా కనిపిస్తున్నారు. వీళ్లు ఇలాగే కష్టపడితే 2024లో ఒకటి, అరా సంచలనాలు ఖచ్చితంగా నమోదు అవుతాయని జిల్లా రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చ నడుస్తోంది. విచిత్రం ఏంటంటే ఈ ముగ్గురు కూడా సీఎం జగన్ సొంత సామాజిక వర్గానికి చెందిన యువనేతలే. ఆ ముగ్గురు ఇప్పుడు మూడు నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లుగా కూడా ఉన్నారు. ప్రొద్దుటూరు ఇన్‌చార్జ్ ఉక్కు ప్రవీణ్‌రెడ్డి - కడప ఇన్‌చార్జ్ బీటెక్ రవి - జమ్మలమడుగు ఇన్‌చార్జ్ దేవగుడి భూపేష్‌రెడ్డి. ఈ ముగ్గురిలో ముందే ఇన్‌చార్జ్‌గా నియమితులు అయిన ప్రవీణ్‌రెడ్డి నియోజకవర్గంలో దూసుకుపోతున్నారు. మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి సోదరుడి కుమారుడు అయిన ప్రవీణ్‌రెడ్డి కడప ఉక్కు నినాదంతో కడప జిల్లాతో పాటు సీమ అంతా హైలెట్ అయ్యారు. పార్టీలతో సంబంధం లేకుండా ప్రవీణ్‌కు జిల్లా వ్యాప్తంగా యువతలో మంచి క్రేజ్ వచ్చింది. ఇక ఆర్థికంగాను పర్వాలేదు. అటు వీరశివారెడ్డితో పాటు ప్రొద్దుటూరు అధికార పార్టీలో గ్రూపు విబేధాలు, ఎమ్మెల్యే రాచమల్లు రెండుసార్లు గెలవడం, వ్యతిరేకతతో కొట్టుమిట్టాడుతూ ఉండడం ప్లస్ అవుతున్నాయి. అయితే మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి వర్గం సపోర్ట్ పెద్దగా లేపోవడం మైనస్. ఈ గ్రూపులు హైకమాండ్ సెట్ చేస్తే 2009లో ఇక్కడ టీడీపీ చేసిన మ్యాజిక్ మరోసారి 2024లో రిపీట్ కావడం పెద్ద కష్టం కాదు. ఇక పులివెందుల కొత్త ఇన్‌చార్జ్‌గా ఎమ్మెల్సీ బీటెక్ రవి పేరును బాబు ఖరారు చేసేశారు. మాజీ ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డి తిరిగి పార్టీలోకి వచ్చినా కూడా రవియే 2024లో పోటీ చేస్తారని బాబు క్లారిటీ ఇవ్వడం శుభపరిణామం. వచ్చే ఎన్నికల్లో చివరి వరకు ఇక్కడ జగన్‌పై ఎవరు పోటీ చేస్తారు ? అన్న కన్ఫ్యూజ్ లేకుండా బాబు క్లారిటీ ఇచ్చేశారు. బీటెక్ రవి జగన్‌పై గెలవకపోవచ్చు.. కానీ కష్టపడితే నియోజకవర్గంలో మరి పునాదులు కూలిపోకుండా కాపాడుకోవచ్చు.. జగన్ మెజార్టీ తగ్గితే కడప ఎంపీ సీటు విషయంలో టీడీపీకి హెల్ప్ అవుతుంది. అయితే 2011 ఉప ఎన్నికల్లో ఇక్కడ రవి జగన్ తల్లి విజయలక్ష్మిపై పోటీ చేశారు. ఈ నియోజకవర్గంతో ఆయనకు అనుబంధమే ఉంది. వైసీపీ అడ్డా.... ఇక ఒకప్పుడు టీడీపీకి కంచుకోటగా ఉండి తర్వాత వైసీపీ అడ్డా అయిపోయిన మరో నియోజకవర్గం జమ్మలమడుగు. ఇక్కడ ఎప్పుడూ రాజకీయాలు ఆదినారాయణ రెడ్డి వర్సెస్ రామసుబ్బారెడ్డిగా ఉండేవి. గత ఎన్నికలకు ముందు వీరు ఇద్దరు టీడీపీలో ఉన్నారు. ఆదినారాయణ కడప ఎంపీగా, రామసుబ్బారెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఇద్దరూ ఓడిపోయారు. తర్వాత ఆది బీజేపీలోకి వెళ్లిపోతే.. రామసుబ్బారెడ్డి వైసీపీలో ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పోటీ ఖాయమైంది. అయితే ఇక్కడ మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి, ఆయన కుమారుడు భూపేష్ రెడ్డి టీడీపీలోకి రావడం.. బాబు వెంటనే భూపేష్‌రెడ్డికి ఇన్‌చార్జ్ పదవి ఇవ్వడంతో పార్టీలో కొత్త జోష్ ఉంది. పైగా మాజీ మంత్రి ఆదికి నారాయణరెడ్డి స్వయానా సోదరుడు. ప్రొద్దుటూరు తర్వాత పార్టీకి ఇక్కడ మంచి అవకాశం ఉంది. ఏదేమైనా చాలా రోజుల తర్వాత కడపలో పార్టీకి ఈ స్థాయిలో బలమైన ఆశాకిరణాలు కనిపిస్తుండడం గొప్ప విషయం. పార్టీ హైకమాండ్ కూడా వీరికి మంచి పుషప్ ఇస్తే 2024లో వైసీపీకి వార్ మరీ అంత వన్‌సైడ్ అవ్వదు.

## వ్యవసాయదారులకు పెద్ద ఎత్తున రుణాలు

నెల్లూరు, మార్చి 4,విత్తనాల నుంచి విక్రయాల దాకా అడుగడుగునా అన్నదాతలకు తోడుగా నిలుస్తూ చేయి పట్టి నడిపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ కృషితో వ్యవసాయదారులకు బ్యాంకులు పెద్ద ఎత్తున రుణాలను మంజూరు చేస్తున్నాయి. ముందెన్నడూలేని రీతిలో బ్యాంకర్లు రుణ వితరణతో ప్రభుత్వ సంకల్పానికి తోడుగా నిలుస్తున్నారు. గతంలో రుణాల కోసం రైతన్నలు కాళ్లరిగేలా బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి. వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల ఊబిలో కూరుకు పోయేవారు. గత మూడేళ్లుగా అడిగిందే తడవుగా అన్నదాతలకు రుణాలు మంజూరవుతున్నాయి. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రస్తుత రబీ సీజన్‌లో రుణాల మంజూరుకు శ్రీకారం చుట్టారు. 2021?22 సీజన్‌లో 1.08 కోట్ల మంది రైతన్నలకు రూ.1.48 లక్షల కోట్ల రుణాలివ్వాలని లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటి వరకు 75.78 లక్షల మందికి రూ.1.23 లక్షల కోట్ల మేర మంజూరయ్యాయి. ఖరీఫ్‌లో లక్ష్యం రూ.86,981 కోట్ల రుణాలు కాగా 50.88 లక్షల మంది రైతులకు రూ.70,531 కోట్ల రుణాలు (81 శాతం) ఇవ్వగలిగారు. స్వల్ప కాలిక రుణాలు 45.88 లక్షల మందికి రూ.56,940 కోట్లు అందాయి. దీర్ఘకాలిక రుణాలు 4.72 లక్షల మందికి రూ.10,966 కోట్లు ఇచ్చారు. వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పన కోసం 27,345 మందికి రూ.2625 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుత రబీ సీజన్‌లో 44.19 లక్షల మందికి రూ.61,518 కోట్ల రుణాలివ్వాలని లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటికే 34.90 లక్షల కుటుంబాలకు రూ.52,659 కోట్ల రుణాలు మంజూరు చేశారు. షార్ట్ టర్మ్ రుణాలు 13 లక్షల మందికి రూ.28,281 కోట్లు, లాంగ్ టర్మ్ రుణాలు 8.28 లక్షల మందికి రూ.17,948 కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించి 66,981 మందికి రూ.6,430 కోట్ల రుణాలు మంజూరు చేశారు. రబీలో మంజూరైన రుణాల్లో ఆప్కాబ్, డీసీసీబీల ద్వారా పంట రుణాలు 6,595.64 కోట్లు, షార్ట్ టర్మ్ రుణాలు రూ.4,893.63 కోట్లు, లాంగ్ టర్మ్ రుణాలు రూ.5,255.92 కోట్లు మంజూరు చేశారు. మరోవైపు కౌలుదారులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సీజన్‌లోనూ ఆర్థిక చేయూత అందిస్తోంది. వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తోంది. ప్రస్తుత రబీ సీజన్‌లో నాకున్న ఎకరం పొలంలో జొన్న సాగు చేశా. స్థానిక సహకార బ్యాంకులో రూ.లక్ష పంట రుణం తీసుకున్నా. ఆర్బీకేలో బ్యాంకింగ్ కరస్పాండెంట్ ద్వారా దరఖాస్తు చేసుకున్నా. ఎలాంటి ఇబ్బంది లేకుండా రుణం మంజూరైంది.

# 3 రాజధానులపై ముందస్తు...

విజయవాడ, మార్చి 4, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, మూడు రాజధానుల ముచ్చటకు రాష్ట్ర హై కోర్టు ముకుతాడు బిగించింది. ఎవరికి ఇష్టం ఉన్నా ఎవరికి లేకున్నా, అమరావతే ఏపె రాజధాని అని తేల్చి చెప్పింది. అమరావతి ఒక్కటే ఏపె రాజధానని న్యాయస్థానం స్పష్టమైన తీర్పును ఇచ్చింది. అయినా మంత్రి బొత్స సత్యనారాయణ తమ ప్రభుత్వ విధానం మూడు రాజధానులేనని మరోమారు స్పష్టం చేశారు. నిజానికి, మూడు రాజధానుల చట్టాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకుందే, మరింత పటిష్ట చట్టం చేసేందుకే అని గతంలోనే ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే ఇప్పుడు కోర్టు తీర్పు నేపథ్యంలో చట్టం చేయడం, అయ్యే పనికాదని, ఒక వేళ కాదని సర్కార్ ముందుకు వెళ్ళినా, ప్రభుత్వం నిర్ణయం న్యాయస్థానం ముందు నిలిచే అవకాశం న్యాయనిపుణులు అంటున్నారు. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ముందస్తు ఎన్నికలకు వెళ్లి, మూడు రాజదానులకు అనుకూలంగా తీర్పు కోరతారా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో వినవస్తోంది. నిజానికి, ముఖ్యమంత్రి మూడు రాజధానుల పంతాన్ని నెగ్గించు కోవాలంటే, ఆయన ముందున్న ఒకే ఒక్క మార్గం మళ్లీ ప్రజా తీర్పు కోరడమే అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జగన్ రెడ్డి అమరావతిని రాజధానిగా అంగీకరించారు. అసెంబ్లీలో అమరావతికి జై కొట్టారు. రాజధాని తీర్మానానికి మద్దతు తెలిపారు. ఎన్నికల ప్రచారంలోనూ అమరావతే రాజధాని అన్నారు. రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా కృష్ణా గుంటూరు జిల్లాల ప్రజలకు ఆ మేరకు స్పష్టమైన హామీ ఇచ్చారు. అప్పట్లో తెలుగు దేశం పార్టీ, వైసీపీ స్టాండ్ పై అనుమానాలు వ్యక్తచేసినా, జగన్మోహన్ రెడ్డి సహా ప్రతి నాయలు అందరూ, అమరావతే రాజధానిగా కొనసాగుతుందని ఒకటికి పదిసార్లు పజలకు హామీ ఇచ్చారు. తెలుగు దేశం అసత్య ఆరోపణలు చేస్తోందని ప్రతి విమర్శలు చేశారు. ఒక విధంగా చూస్తే ప్రజలను నమ్మించి ఓట్లు దండుకున్నారు. అయితే ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఆయన ఆలోచనలలో మార్పు వచ్చింది. కొత్త ఆలోచనలకు అనుకూలంగా, తమ నిర్ణయానికి అనుకూలంగా, 'మమ' అనిపించేదుకు బోస్టన్ కమిటీ వేశారు. బోత్స కమిటీని తెరమీదకు తెచ్చారు. ప్రపంచంలో ఎక్కడో ఒకటి రెండు చోట్ల మూడు రాజధానులు ఉన్నాయని చెప్పు కొచ్చారు. కానీ, ఈ రెండు మూడు దేశాలు మినహా మిగిలిన అన్ని దేశాలలో, మన దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఒకటే రాజధాని ఉందనే విషయాన్ని మాత్రం పక్కన పెట్టారు. ఇది ప్రజల్ని వంచించడమేనన్న విమర్శలు వచ్చాయి. రైతుల్ని మోసం చేశారని ఆరోపణలు వచ్చాయి. అయినా పట్టించుకోలేదు. ముందుకెళ్లారు. న్యాయస్థానాల్లో ఎదురు దెబ్బలు తగిలాయి. ఇప్పుడు ఎటూ మూడు రాజధానులపై ముందుకెళ్లలేని పరిస్థితి ఉంది. కాబట్టి మూడు రాజధానుల ఎజెండాగా ఎన్నికలకు వెళ్లడం ఒక్కటే, ముఖ్యమంత్రి ముందున్న మార్గం అంటున్నారు. అయితే, ముఖ్యమంత్రి ఆ సాహసం చేస్తారా ? నిండా రెండేళ్ళ అధికారాన్ని వదులుకుని, ఎన్నికల బరిలో దిగుతారా, అనేది అనుమానమే అంటున్నారు. నిజానికి తెలుగు దేశం,ఇతర ప్రతిపక్షాలు ఎప్పటి నుంచో మూడు రాజదానుల పై ప్రజాభిప్రాయం తీసుకోవాలని సవాల్ చేస్తున్నాయి. అయినా, ప్రభుత్వం స్పందించలేదు. అయితే ఇప్పుడు గత కొంత కాలంగా, ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ముందస్తు ఎన్నికలకు వెళ్ళే ఆలోచన చేస్తున్నారని వార్తలు వస్తున్న నేపథ్యంలో, దీన్ని అవకాశంగా తీసుకుని ఆ దిశగా అడుగులు వేస్తారా, అనే చర్చ రాజకీయ వర్గాల్లో వినవస్తోంది. అయితే, ముందస్తు ఎన్నికల గురించి ఎవరెంత మాట్లాడినా, అటు అధికార వైసీపీ గానీ, ఇటు ప్రధాన ప్రతిపక్ష పార్టీ టీడీపీ కానీ, అలాగే, జనసేన సహా ఇతర పార్టీలు ఏవీ కూడా ముందస్తు ఎన్నికలకు సిద్దంగా లేవు. ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. సో.. ముందస్తు వచ్చే ఛాన్స్' అంతగా లేదని రాజకీయ విశ్లేషకులు

## అసెంబ్లీ సమావేశాలకు బాయ్ కాట్

విజయవాడ, మార్చి 4, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 7వ తేదీన ప్రారంభంకాబోతున్నాయి.. ఈ సమావేశాల్లోనే వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది సర్కార్.. అయితే, అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండాలని టీడీపీ నిర్ణయం తీసుకుంది.. ఇవాళ సమావేశమైన టీడీపీ పొలిట్ బ్యూరో? అసెంబ్లీ సమావేశాలకు వెళ్లకూడదనే నిర్ణయానికి వచ్చింది.. అయితే, టీడీఎల్పీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.. పొలిట్‌బ్యూర్ సమావేశం ముగిసిన తర్వాత మీడియాతో మాట్లాడిన పార్టీ నేత కాలువ శ్రీనివాసులు.. కౌరవ సభను తలపించేలా అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి.. అసెంబ్లీలో ప్రజా సమస్యలు చర్చించే అవకాశం లేకుండా.. మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని విమర్శించారు.. వైసీపీ ఎమ్మెల్యేలు ఉత్సవ విగ్రహాలుగా మారారని మండిపడ్డారు. ఇక, ఏడాది పాటు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు నిర్వహించాలని పొలిట్‌బ్యూరో నిర్ణయించినట్టు తెలిపారు. కాలువ శ్రీనివాసులు.. 40 ఏళ్ల ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను హైదరాబాద్‌లో.. మహానాడును విజయవాడలో జరపాలని నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు, హైకోర్టు తీర్పు జగన్‌కు చెంపపెట్టు అన్నారు కాలువ.. సీఎం జగన్ ఇప్పటికైనా మూడు రాజధానులకు స్వస్తి చెప్పాలని సూచించిన ఆయన.. రాష్ట్ర ఆదాయం తగ్గిపోయింది.. సంవత్సరానికి రూ. 12 వేల కోట్ల ఆదాయం కోల్పోయాం అన్నారు.. అమరావతిలో నిర్మాణాలు పూర్తి చేయాలని సలహా ఇచ్చారు. ఇక, వైఎస్ వివేకా హత్య కేసులో కట్టు కథలు అల్లుతున్నారని ఆరోపించారు శ్రీనివాసులు.. అసలు సూత్రధారులను త్వరగా అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. 35 సంక్షేమ పథకాలను రద్దు చేసి.. పేదలకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన.. కేంద్ర పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వడం లేదన్నారు.. రాష్ట్రంలో రూ. 12 వేల కోట్ల పథకాలు ఆగిపోయాయని విమర్శించారు.

# కడపకు రానున్న సీబీఐ బాస్

కడప, మార్చి 4,వైయస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ దూకుడును మరింత పెచ్చింది. ఆ క్రమంలో ఢిల్లీ నుంచి సీబీఐ ఉన్నతాధికారులు గురువారం నేరుగా కడపకు వస్తున్నట్లు సమాచారం. ఆ క్రమంలో కడప ఎంపీ వైయస్ అవినాశ్ రెడ్డితోపాటు ఆయన తండ్రి వైయస్ భాస్కరరెడ్డికి సైతం వీరు నోటిసులు జారీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు..ఇప్పటికే వీరిద్దరికీ సీబీఐ నోటీసులు జారీ చేసిదంటూ ఓ వార్త అయితే జిల్లావ్యాప్తంగా జోరుగా వైరల్ అవుతోంది. అంతేకాకుండా వీరిని సీబీఐ ఉన్నతాధికారులు అదుపులోకి తీసుకునే అవకాశం కూడా ఉందని సమాచారం. వివేకా హత్య కేసు దర్యాప్తులో భాగంగా నిందితులు ఇచ్చిన ప్రతి వాంగ్మూలంలో వైయస్ అవినాశ్ రెడ్డి పేరు ఉందన్న సంగతి అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో అయన్ని ఒకటి లేదా రెండు రోజుల్లో సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకుంటారని సమాచారం. ఓ వేళ ఆయన్ని అదుపులోకి తీసుకుంటే జిల్లాలో ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఇప్పటికే జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో సీబీఐ ఉన్నతాధికారులు చర్చించినట్లు కూడా తెలుస్తోంది. ఈ ఫిబ్రవరిలో సీబీఐ డీఐజీ చౌరసియా ఢిల్లీ నుంచి కడప వచ్చారు. ఆయన జిల్లా సెంట్రల్ జైల్‌లోని అతిథి గృహంలోనే దాదాపు వారం రోజుల మకాం వేసి.. మరీ వివేకా హత్య కేసులోని అన్నీ పరిణామాలను ఆయన ఉన్నతాధికారులతో చర్చించినట్లు తెలుస్తోంది. అయితే అప్పడే ఈ కేసులో కీలక నిందితులకు భేడీలు పడతాయనే ప్రచారం కూడా గట్టిగానే నడిచింది. కానీ అది చివరి నిమిషంలో ఆగిందని సమాచారం. అయితే ఫ్యాన్ పార్టీకి చెందిన కీలక నేత.. ఢిల్లీ నుంచి పెద్ద ఎత్తున లాబీయింగ్ జరపడం వల్ల .. ఈ అరెస్ట్ ఆగినట్లు తెలుస్తోంది. ఏదీ ఏమైనా.. ఈ వివేకా హత్య కేసులో నిందితులు ఎవరంటే.. అందరి వేళ్లు.. వైయస్ అవినాశ్ రెడ్డి వైపు చూపిస్తున్నాయన్న సంగతి తెలిసిందే. అంతేకాకుండా.. వివేకా హత్య కేసులోని నిందితులు ఇప్పటికే కడప సెంట్రల్ జైలులో ఉన్నారన్న విషయం విధితమే. 2019, మార్చి 15వ తేదీన పులివెందులలో వైయస్ వివేకానందరెడ్డి దారుణ హత్యకు గురయ్యారు. తొలుత ఆయనది గుండె పోటు అంటు ప్రచారం జరిగింది. కానీ ఆయనను అత్యంత పాశవికంగా హత్య చేశారు. ఈ విషయంలో ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైయస్ జగన్ ప్రభుత్వం వ్యవహారించిన తీరు అందరికీ తెలిసిందే. ఆ క్రమంలో వైయస్ వివేకా భార్య సౌభాగ్యమ్మ, ఆయన కుమార్తె వైయస్ సునీత ఏపీ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. దీంతో ఈ కేసును సీబీఐకు అప్పగిస్తూ ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు దర్యాప్తు కొంత కాలం నత్తనడకలా సాగినా.. ఆ తర్వాత.. సీబీఐ తనదైన శైలిలో దూకుడు పెంచింది. అదీకాక.. వివేకా మాజీ కార్ డ్రైవర్ అప్రూవర్‌గా మారి.. ఈ కేసులోని అన్ని విషయాలు సుపారీతో సహా సీబీఐ ముందు పూసగుచ్చినట్లు వివరించారు. దీంతో ఈ హత్య కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ పని కాస్తా సులువు అయిందనే టాక్ కూడా బాగానే నడిచింది. అయితే ఆ తర్వాత వివేకా హత్య కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ పైనే కాకుండా ఆ సంస్థ ఉన్నతాధికారులపైన.. వివేకా కుమార్తె, అల్లుడిపైన కూడా కేసులు పెట్టేందుకు ఓ విధమైన తెరచాటు కుట్రకు నిందితులు శ్రీకారం చుట్టారు. దాంతో వివేకా హత్య కేసులో ఏం జరుగుతోందనేది ప్రజలకు అర్థం కాని పజిల్‌గా మరిపోయింది. ఆ క్రమంలో సీబీఐ సైతం సైలెంట్ అయిపోయింది. ఆ తర్వాత సీబీఐ.. ఈ కేసును ఛేదించేందుకు తనదైన శైలిలో ముందుకు దూసుకుపోయింది... పోతోంది. మరికొద్ది రోజుల్లో ఈ హత్య కేసు వెనుక ఉన్న అసలు సూత్రదారులు, పాత్రదారులను ప్రజలు ముందు నిలబెట్టేందుకు సీబీఐ శక్తి మేర పనిచేస్తోంది.

## ఘనంగా హేమావతి బ్రహ్మోత్సవాలు

అనంతపురం అనంతపురం జిల్లా మడకశిర తాలూకా హేమావతి లో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంబమయ్యాయి. శైవక్షేత్రాల్లో ఎక్కడచూసిన శివుడు లింగాకారంలో దర్శనమిస్తాడు అయితే ఇక్కడ దేశంలో ఎక్కడా లేని విధంగా శివుడు మానవ రూపంలో దర్శనమివ్వడం ఈ క్షేత్రం యొక్క విశేషం. అనంతపురం జిల్లా మడకశిర నియోజకవర్గంలోని అమరాపురం మండలం హేమావతి గ్రామంలో వెలిసిన శివాలయంలో స్వామివారిని భక్తులు హేంజేరు సిద్దేశ్వర స్వామి గా కొలుస్తున్న ఈఆలయం ఎంతో ప్రసిద్ధి గాంచింది. అతి పురాతనమై ఈఆలయాన్ని నొలంబరాజుల కాలంలో నిర్మించారని ఆలయ చరిత్ర తెలుపుతోంది. ఇక్కడ ప్రతి ఏటా మహా శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకొని బ్రహ్మోత్సవాలు ఐదు రోజుల పాటు ఘనంగా జరుగుతాయి. ఈ ఉత్సవాల్లో భక్తులు ఇతర రాష్ట్రాల నుండి అధికంగా పాల్గొంటారు

## వైఎస్ వివేకా కేసులో సీబీఐ దూకుడు

కడప, మార్చి 4, వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ దూకుడు పెంచింది. అయితే ఈ హత్య ఇప్పుడు రాజకీయంగా పెనుదుమారం రేపుతోంది. అధికార వైసీపీ నేతలే హత్యకు కారణమని టీడీపీ ఆరోపిస్తుంది. వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్ రెడ్డి కూడా వైసీపీ ఎంపీ అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్ రెడ్డి ఈ హత్య కుట్ర పన్నారని ఆరోపిస్తున్నారు. నిందితులను తన అన్న ముఖ్యమంత్రి జగన్ రక్షించే ప్రయత్నం చేస్తున్నారని సునీత ఆరోపిస్తున్నారు. ఇక ఏ గొడవలుండవ్ టీడీపీ రాజకీయంగా... వైఎస్ కుటుంబంలో ఈ హత్యకు సంబంధించి తలెత్తిన వివాదాన్ని తెలుగుదేశం పార్టీ క్యాష్ చేసుకుంటుంది. సీబీఐ అధికారులకు

కూడా ప్రాణహాని ఉందని చెబుతుంది. సీబీఐ అధికారిపై పోలీసులు కేసు నమోదు చేయడంతో టీడీపీ దీనిని రాజకీయంగా అనుకూలంంగా మార్చుకునే ప్రయత్నం చేస్తుంది. చంద్రబాబు అధికారంలో ఉండగా కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలను రాష్ట్రంలో ప్రవేశించకుండా చట్టాన్ని తీసుకు వచ్చారు. ఇప్పుడు అదే తెలుగుదేశం పార్టీ సీబీఐ విచారణను స్వాగతిస్తుంది. రాజకీయంగా లాభపడటానికి ప్రయత్నిస్తుంది. అధికార వైసీపీ కూడా ఈ హత్యతో తమ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని చెబుతోంది. అవినాష్ రెడ్డి వివేకాను హత్య చేయించేందుకు ఎందుకు కుట్ర పన్నుతారని ప్రశ్నిస్తుంది. వైఎస్ కుటుంబంలోని కొందరు వ్యక్తిగత విషయాలు బయటపడతాయానే తాము మౌనంగా ఉన్నామని చెబుతోంది. వీరిపైనే అనుమానం.... ఈ కేసులో ప్రధానంగా అవినాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డిలతో పాటు వివేకా అల్లుడు రాజశేఖర్ రెడ్డిపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివేకా వ్యక్తిగత జీవితంలో మరో కోణం ఉందని, ఆస్తులను కాపాడుకోవడం కోసమే అల్లుడు ఈ హత్య చేయించి ఉంటాడని వైసీపీ నేతలు చెబుతున్నారు. సీబీఐ ఆ దిశగా దర్యాప్తు చేయాలని కోరుతున్నారు. మొత్తం మీద ఏపీ రాజకీయాల్లో వివేకా హత్య హాట్ టాపిక్ గా మారింది. వచ్చే ఎన్నికల ప్రచారంలో ఇది ప్రధాన ప్రచారాంశంగా మారనుంది. చివరకు ఎవరు ఈ కేసులో చిక్కుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

# చిత్తూరు త్వరలో బుల్లెట్ ట్రైన్స్

తిరుపతి, మార్చి 4,జపాన్, జర్మనీ దేశాల్లో కనిపించే జెట్ స్పీడ్ బుల్లెట్ రైళ్లను త్వరలోనే జిల్లాలోనూ చూడబోతున్నాం. గంటకు 350 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లడం బుల్లెట్ ట్రైన్ ప్రత్యేకత. ఇప్పటి వరకు దేశంలోనే అత్యంత వేగంగా నడిచే శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలులో చెన్నై నుంచి 320 కిలోమీటర్ల దూరంలోని బెంగళూరుకు ప్రయాణించాలంటే గంటకు 70 కి.మీ సగటున దాదాపు ఐదు గంటల సమయం పట్టేది. ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ ద్వారా అయితే ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం కేవలం రెండు గంటలే.ఇప్పటికే దేశంలో ముంబై?అహ్మదాబాద్, ఢిల్లీ?వారణాసితో పాటు మరో మూడు మార్గాల్లో బుల్లెట్ ట్రైన్ కారిడార్లున్నాయి. ఆరో మార్గంగా చెన్నై?మైసూర్ కారిడార్‌ను జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించనున్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం 2018లోనే జర్మన్ ప్రభుత్వంతో సంప్రదింపులు చేసింది. 2020 జూన్‌లో చెన్నై?మైసూర్ రైల్వే కారిడార్ నిర్మాణానికి చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ప్రస్తుతం జిల్లాలోని పలమనేరు నియోజకవర్గం నుంచి తమిళనాడు సరిహద్దు వరకు ప్రాథమిక సర్వేతోపాటు బెంచిమార్క్‌ల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. కేంద్ర రైల్వేశాఖ ఎన్‌హెచ్ఆర్ఆర్‌సీఎల్ (నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్)ద్వారా చెన్నై?మైసూరు బుల్లెట్ ట్రైన్ పనులు చేపడుతోంది. 2019లోనే ఇందుకు సంబందించి డీపీఆర్ (డీటైల్ ప్రాజెక్టు రిపోర్ట్) సిద్ధం చేసింది. ఈ మార్గానికి సంబంధించిన ఇప్పటికే టెండర్ల పక్రియను సైతం పూర్తి చేసింది. అందులో భాగంగా సర్వే పనులను ఇంజినీరింగ్ మాగ్నిట్యూడ్ కంపెనీ దక్కించుకుంది. ట్రాఫిక్‌కు సంబంధించిన పనులను పీకే ఇంజనీర్స్‌కంపెనీ, జనరల్ అలైన్‌మెంట్ డ్రాయింగ్స్‌ను ట్రాన్స్‌లింక్ కంపెనీ, ఫైనల్ అలైన్‌మెంట్‌ను ఆర్వీ అసోసియేట్స్, ఓవర్‌హెడ్, అండర్‌గ్రౌండ్ పనులను సుబుది టెక్నాలజీస్ కంపెనీ చేపడుతోంది. ఆర్ఏపీ ( రీసెటిల్‌మెంట్ యాక్షన్‌ప్లాన్)ని ఓవర్‌సీస్ మిన్?టెక్ కన్సల్టెంట్స్, ఎన్విరాల్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ రిపోర్ట్‌ను మరో కంపెనీ చేపట్టనున్నట్టు ప్రస్తుతం ఇక్కడ పనులు చేస్తున్న కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. చెన్నై నుంచి మైసూరు మార్గంలో కేవలం తొమ్మిది స్టాపింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. తమిళనాడులో చెన్నై, పూనమల్లై, అరక్కోణం, కర్ణాటకలో బంగారుపేట, బెంగళూరు, చెన్నపట్న, మండ్య, మైసూరు, జిల్లాలో కేవలం చిత్తూరులో మాత్రమే బుల్లెట్ రైళ్లు ఆగనున్నాయి. కారిడార్‌కు సమీపంలోనే చెన్నై?బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌హైవే ఉండేలా మార్గంలో అలైన్‌మెంట్ చేశారు. ఈ ప్రాజెక్టులో అండర్‌గ్రౌండ్ ( సొరంగమార్గం), ఎలివేషన్ వయాడక్ట్, ఓవర్‌హెడ్, ఫ్లైఓవర్ వంతెనలతో ట్రాక్ నిర్మాణం సాగనుంది. బెంగళూరులో రెండు అండర్‌గ్రౌండ్ రైల్వే స్టేషన్లు సైతం నిర్మించేలా ప్రణాళికలో పొందుపరిచారు. మధ్య 435 కిలోమీటర్ల దూరం ఉంది. బుల్లెట్ ట్రైన్ గంటకు 350 కిలోమీటర్లు ప్రయాణిస్తే దాదాపు ఒకటిన్నర గంటలో చేరుకోవచ్చు. సగటు వేగం గంటకు 320 కిలోమీర్లు అయితే సుమారు రెండు గంటలు పట్టొచ్చు.

9 స్టేషన్లలో ఆపిన సమయాన్ని లెక్కగడితే మరో 45 నిమిషాలు మాత్రమే అదనంగా పరిగణించవచ్చు. ఆ లెక్కన 2.45 నిమిషాల్లో గమ్యస్థానాన్ని చేరుకొనే అవకాశం ఉంటుంది.కర్ణాటక సరిహద్దుల నుంచి జిల్లాలోని వి.కోట, బైరెడ్డిపల్లె, పలమనేరు మండలాల మీదుగా తమిళనాడు సరిహదులోని గుడిపాల మండలం వరకు ట్రాక్ నిర్మాణం కోసం శరవేగంగా సర్వే సాగుతోంది. ముఖ్యంగా పలమనేరు మండలంలోని సాకేవూరు, బేలపల్లె, కొలమాసనపల్లె, కూర్మాయి. పెంగరగుంట, సముద్రపల్లె సమీపంలో బెంచిమార్కులను ఏర్పాటు చేస్తున్నారు. బుల్లెట్ ట్రైన్ ట్రాక్‌ను అత్యాధుని పరిజ్ఞానంతో భూకంపాలను సైతం తట్టుకునేలా నిర్మించనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆటోమేటిక్ బ్రేకింగ్ సిస్టం ఉంటుందని సర్వే చేస్తున్న కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

బుల్లెట్ ట్రైన్, ట్రాక్ ప్రత్యేకతలు
రైలు అత్యధిక వేగం గంటకు 350 కిలోమీటర్లు
ఆపరేషన్ స్పీడ్ గంటకు 320 కిలోమీటర్లు
ట్రాక్‌గేజ్ : స్టాండర్డ్ (1435 ఎం)
డీఎస్? ఏటీజీ సిగ్నలింగ్
ట్రైన్ కెపాసిటీ : 750 మంది ప్రయాణికులు
చెన్నై?మైసూర్ మధ్య దూరం 435 కిలోమీటర్లు
రైలు స్టాపింగ్ స్టేషన్లు : 9

## హాస్టల్ విద్యార్థులను కాటేసిన కట్లపాము

విజయనగరం విజయనగరంజిల్లా కురుపాం మండలంలో విషాదం చోటు చేసుకుంది. బీసీ హాస్టల్?లోకి కట్లపాము చొరబడింది. అర్థరాత్రి నిద్రిస్తున్న ముగ్గురు విద్యార్థుల ముఖంపై కట్లపాము కాటేసింది. పాము కాటుతో విద్యార్థులు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. దీంతో తోటి విద్యార్థులు హాస్టల్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన హాస్టల్ సిబ్బంది పాముకాటుకు గురైన విద్యార్థులను 108 అంబులెన్స్ సహాయంతో విజయనగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. పాముకాటు వల్ల విద్యార్థుల పరిస్థితి విషమించడంతో మిగతా విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. రంజిత్ అనే విద్యార్థి మృతి చెందాడు మిగతా ఇద్దరు పరిస్థితి ఇ విషమంగా ఉందని చెప్పాలి సంఘటనా స్థలానికి జిల్లా కలెక్టర్ కుమారి చేరుకున్నారు స్థానిక రాజకీయ నాయకులు హాస్టల్ వసతి గృహాన్ని సందర్శించారు కనీస సదుపాయాలు లేకపోవడంతో ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని అఖిలపక్ష నాయకులు మీడియాకు తెలియజేశారు

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు - పూర్ణాహుతి

శ్రీశైలం మహాశివరాత్రి పురస్కరించుకొని సామూహిక దీక్షతో పదకొండు రోజుల పాటు నిర్వహింపబడే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో పదవరోజైన గురువారం రోజు ఉదయం శ్రీ స్వామి అమ్మవార్లకు విశేషపూజలు జరిగాయి. తరువాత శ్రీ స్వామివారి యాగశాల యందు శ్రీ చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాదికాలు జరిపించబడ్డాయి. రుద్రహోమం, చండీహోమం జరిపించడ్డాయి.తరువాత యాగ పూర్ణాహుతి, వసంతోత్సవం, ఆవబృథం, త్రిశూల స్నానం కార్యక్రమాలు జరిపించబడ్డాయి.పూర్ణహుతిపూర్ణాహుతి కార్యక్రమంలో శాస్త్రోక్తంగా నారికేళాలు, పలు సుగంధ ద్రవ్యాలు, ముత్యం, పగడం, నూతన వస్త్రాలు మొదలైన ద్రవ్యాలను హోమగుండంలోకి ఆహుతిగా సమర్పించి యాగ కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరిగింది.అనంతరం జరిగిన వసంతోత్సవంలో ఆలయ అర్చకులు, వేదపండితులు వసంతాన్ని పసుపు, సున్నం కలిపిన మంత్ర పూరిత జలం) సమంత్రకంగా భక్తులపై ప్రోక్షించారు. తరువాత జరిగిన అవబృథస్నానంలో చండీశ్వరస్వామికి పుష్కరిణీ వద్ద ఆగమశాస్త్రోక్తంగా స్నానాదిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. చివరగా త్రిశూలస్నాన కార్యక్రమం నిర్వహించబడింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రోజు సాయంకాలం ధ్వజావరోహణ కార్యక్రమం జరిపించబడుతుంది.ఈ ధ్వజావరోహణ కార్యక్రమంలో ఉత్సవాల మొదటిరోజున బ్రహ్మోత్సవ ప్రారంభ సూచకంగా ఆలయ ప్రధాన ధ్వజస్తంభంపై ఆవిష్కరింపజేసిన ధ్వజపటం అవరోహణ చేయబడుతుంది.సదస్యం నాగవల్లిమహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగానే గురువారం రోజు నిత్య కళ్యాణ మండపంలో సదస్యం మరియు నాగవల్లి కార్యక్రమాలు జరిపించబడ్డాయి. సదస్యం కార్యక్రమంలో వేదపండితులచే వేదసుప్తి నిర్వహించబడుతుంది.వేదసుస్తిలో వేదపండితులు చతుర్వేద పారాయణలతో, స్తోత్రాలతో శ్రీస్వామి అమ్మవార్లను ఆ తరువాత జరిగే నాగవల్లికార్యక్రమంలో మహాశివరాత్రి రోజున కల్యాణోత్సవం జరిపించబడిన శ్రీ భ్రమరాంబాదేవి వారికి ఆగమశాస్త్రం సంప్రదాయం మేరకు మెట్టెలు. నల్లపూసలు సమర్పించబడుతాయి..ఈ రోజుతో ముగియనున్న బ్రహ్మోత్సవాలుఈ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం రోజుతో ముగియమన్నాయి. ఈ ఉత్సవాలముగింపులో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీస్వామి అమ్మవార్లకు విశేష పూజలు జరిపించబడతాయి. తరువాత సాయంకాలం శ్రీ స్వామివార్లకు అశ్వవాహనసేవ మరియు ఆలయ ఉత్సవం జరిపించబడుతుంది. ఆలయ ఉత్సవం అనంతరం శ్రీస్వామి అమ్మవార్లకు పుష్పోత్సవం, శయనోత్సవం - జరిపించబడతాయి.

## అక్రమ లే ఔట్లు,వెంచర్లపై రెవెన్యూ,మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం

### సీపీఐ విమర్శ

బద్వేలు బద్వేల్ పట్టణంలో ప్రభుత్వ భూములు విరివిగా వెలుస్తున్న అక్రమ వెంచర్లు లే అవుట్లను మరియు భూకబ్జాలపై ఉక్కుపాదం మోపుతామని అన్న బద్వేల్ ఆర్డీఓ ప్రకటనలు నీటిమీద రాతలు గా మారాయని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ పట్టణ కార్యదర్శి చంద్రమోహన్ రాజులు ఘాటుగా విమర్శించారు గురువారం ఉదయం బద్వేలు పట్టణం గోపవరం మండలం మడకలవారి పల్లి పంచాయతీ సర్వే నెంబర్ 1006,1007,1008 లోని 10 ఎకరాల ప్రభుత్వ భూమిలో వేస్తున్న అక్రమ వెంచర్లు లే అవుట్లను సిపిఐ బద్వేలు పట్టణ సమితి ఆధ్వర్యంలో పరిశీలించడం జరిగింది ఈ సందర్భంగా వీర శేఖర్ మాట్లాడుతూ బద్వేల్ రెవెన్యూ డివిజన్ అయినప్పుడు ఈ ప్రాంతంలోని భూకబ్జాలు ఆక్రమణలకు కు ఫుల్ స్టాప్ పడుతుందని అందరూ సంతోష పడ్డారని కానీ ఈ రెండు నెలల్లోనే దాదాపుగా 100 ఎకరాలు పైబడి అత్యంత విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని, ప్రభుత్వ భూముల్లో యదేచ్ఛగా అక్రమ వెంచర్లు వేస్తున్నారు అని వీటిని నివారించడంలో అటు రెవిన్యూ అధికారులు ఇటు మున్సిపల్ అధికారులు విఫలమయ్యారని విమర్శించారు వీరిరువురు ఒకరిమీద ఒకరు సాకులు చెప్పుకుంటూ సమస్యను నాన్చుతూ అక్రమార్కులపై తక్షణ చర్యలు తీసుకోకుండా సహకరిస్తున్నారని సందేహం కలుగుతున్నదని వారు అనుమానం వ్యక్తం చేశారు డికెటి భూములలో వేసిన వెంచర్లకు ప్రభుత్వ అనుమతులు ఇవ్వరని తెలిసినా అధికార పార్టీ నేతల అండతో ఇష్టారాజ్యంగా వెంచర్లు వేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఇటువంటి వారి పైన తక్షణమే సివిల్ క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అన్నారు.

## మహిళల సాధికారత కు ప్రాధాన్యత

గూడూరు మహిళల సాధికారతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం వైఎస్ జగన్మోహన్రెడ్డి సారథ్యంలో నడుస్తున్న మన రాష్ట్ర ప్రభుత్వం అని గూడూరు ఎమ్మెల్యే వర ప్రసాదరావు తెలిపారు . గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు . ఈ సమావేశంలో జెడ్పిటిసి సభ్యురాలు యామిని , మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల , వైసీపీ నాయకులు నరేందర్ రెడ్డి , శ్రీనివాసులు , గోపాల్ యాదవ్ , మురళి , నరసయ్య , విజయ్ కుమార్ రెడ్డి , మొబిన్ తదితరులు పాల్గొన్నారు.గూడూరు ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే వర ప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా నామినేటెడ్ పదవులలో 50 శాతం పదవులు మహిళలకు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు . రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో మహిళలకు పెద్దపీట వేస్తూ అమ్మఒడి , చేయూత , ఆసరా పథకాలు అమలులో ఉన్నాయని తెలిపారు . మహిళల రక్షణ కోసం దిశా యాప్ దేశ చరిత్రలో మొదటిసారిగా ప్రవేశ పెట్టి మహిళల సంక్షేమానికి పాటుపడే ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వం అని తెలిపారు . మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8వ తేదీన విజయవాడలో తలపెట్టిన మహిళా సదస్సు విజయవంతం చేసేందుకు నియోజకవర్గ పరిధిలోని మహిళలు అందరూ సహకరించాలని కోరారు .

# 97 శాతం పూర్తయిన పోలవరం ప్రాజెక్టు సనులు



పోలవరం పోలవరం ప్రాజెక్టు నిర్మాణపనులు 97 శాతానికి పైగా పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. స్పిల్ వే కాంక్రీట్ పనులు దాదాపు 97.25శాతం పైగా పూర్తి అయ్యాయి. స్పిల్ వే లో 3,30968 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులను పూర్తి చేసారు. స్పిల్ వేలో అమర్చాల్సిన 48 రేడియల్ గేట్లకు గానూ 42 గేట్లను అమర్చడం జరిగింది.మిగిలిన 6 గేట్లను అమర్చే పనులు చురుకుగా సాగుతున్నాయి. రేడియల్ గేట్లకు అమర్చాల్సిన 96హైడ్రాలిక్ సిలిండర్లకు గానూ 84 సిలిండర్లను అమర్చారు. గేట్లను ఎత్తడానికి అవసరమైన 24 పవర్ ప్యాక్ సెట్లను ఇప్పటికే అమర్చడం పూర్తి అయింది. అదేవిధంగా 10రివర్ స్లూయిజ్ గేట్లను,వాటికి 20హైడ్రాలిక్ సిలిండర్ల తో పాటు 10 పవర్ ప్యాక్ సెట్లను కూడా అమర్చడం పూర్తి అయింది. స్పిల్ వే లో కీలకమైన ఫిష్ ల్యాడర్ పనులు సైతం దాదాపు పూర్తి కావొచ్చాయి. స్పిల్ వే భద్రతకు సంబందించి ఎడమవైపున గైడ్ బండ్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. స్పిల్ ఛానెల్ లో 88.89% కాంక్రీట్ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. అదే విధంగా స్పిల్ ఛానెల్ లో 81.38% పైగా మట్టి తవ్వకం పనులు పూర్తి అయ్యాయి. స్పిల్ ఛానెల్ లో కీలకమైన ఎండ్ కటాఫ్ వాల్ నిర్మాణం సైతం ఇప్పటికే పూర్తయ్యింది. ఇంక అప్రోఛ్ ఛానెల్ లో దాదాపు 74.44 లక్షల క్యూబిక్ మీటర్లకు పైగా మట్టి తవ్వకం పనులు పూర్తి అయ్యాయి. కీలకమైన ఎగువ కాఫర్ డ్యాం నిర్మాణం పూర్తి అయింది. ఎగువ కాఫర్ ధ్యాం ను 2480మీ పొడవున, 42.5మీటర్ల ఎత్తు న పూర్తి స్దాయి లో నిర్మాణం పూర్తి చేయడం జరిగింది. జూన్-11-2021న గోదావరి నదీ సహజ ప్రవాహాన్ని అప్రోచ్ ఛానెల్ మీదుగా స్పిల్ వే వైపు మళ్ళించడం జరిగింది.ఇలా అప్రోచ్ ఛానెల్ నుండి స్పిల్ వే మీదుగా గోదావరి నదిని దాదాపు 6.6కి.మీ మళ్ళించడం జరిగింది. (చరిత్రలో మొదటి సారి గోదావరి నదీ ప్రవాహాన్ని కుడివైపు నుండి ఎడమవైపు దాదాపు 6.6 కి.మీ దారిమళ్ళించడం ఇంజనీరింగ్ అద్భుతం-ఒక నదీ ప్రవాహాన్ని గత యేడాది లో 25రోజుల పాటు నిలిపివేయడం జరిగింది. ఇంక దిగువ కాఫర్ డ్యాం నిర్మాణ పనులు సైతం శరవేగంగా సాగుతున్నాయి. దిగువ కాఫర్ ధ్యాం నిర్మాణ పనులు దాదాపు 84.33% పూర్తయ్యాయి. త్వరలోనే దీని నిర్మాణం కూడా పూర్తి కానుంది. ఇటీవలే గ్యాప్-3 కాంక్రీట్ డ్యాం నిర్మాణం సైతం పూర్తిచేసారు. ఇప్పటికే గ్యాప్2లో ఈసిఆర్ఎఫ్ డ్యాం నిర్మాణానికి సంబందించి 11,96,500 క్యూబిక్ మీటర్ల వైబ్రోకాంపాక్షన్ పనులు అనగా దాదాపు 75శాతం పనులు పూర్తి అయ్యాయి. అదేవిధంగా 1,61,310 క్యూబిక్ మీటర్ల శాండ్ ఫిల్లింగ్ పనులు పూర్తి అయ్యాయి. గ్యాప్-2 మెయిన్ డ్యాం ఏరియాలో పనులకు అనుకూలంగా ముందుగా నదిలో నీటిని తోడేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గ్యాప్-1లో 400 మీటర్ల పొడవున ప్లాస్టిక్ కాంక్రీట్ ధ్యాం నిర్మాణం పూర్తి అయింది. గ్యాప్-1లో నేలను గట్టి పరిచేందుకు స్టోన్ కాలమ్స్ పనులు పూర్తి అవ్వగా,కీలకమైన డీప్ సాయిల్ మిక్సింగ్ పనులు సైతం దాదాపు పూర్తి కావొచ్చాయి. ఆసియాలో మొదటి సారి ఆధునిక టెక్నాలజీతో గ్యాప్-1లో డీప్ సాయిల్ మిక్సింగ్ పనులు జరుగుతున్నాయి. ఇంక కీలకమైన జలవిద్యుత్ కేంద్రానికి సంబందించి కొండ తవ్వకం పనులు దాదాపు 99.37% పూర్తయ్యాయి. జలవిద్యుత్ కేంద్రానికి సంబందించి 12 ప్రెజర్ టన్నెల్స్ తవ్వకం పనులు ఇప్పటికే పూర్తి చేసారు. ట్రైల్ రేస్ ఛానెల్ లో మట్టితవ్వకం పనులు సైతం వేగంగా జరుగుతున్నాయి.

# మంగళగిరిలో నారా లోకేష్ పర్యటన



మంగళగిరి గుంటూరు జిల్లా మంగళగిరి లో శుక్రవారం నాడు టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటించారు. లోకేష్ మాట్లాడుతూ బాబాయ్ వివేకా హత్య చేయించింది అబ్బాయి జగన్ రెడ్డే. అవినాష్ రెడ్డి హత్య చేయించాడని తేలిపోయింది. ఇక జగన్ రెడ్డి పాత్ర పై సీబీఐ విచారణ జరగాలి. నాడు సొంత పత్రికలో నారాసుర రక్త చరిత్ర అని అసత్య ప్రచారం చేసారు. నేడు బాబాయ్ పై గొడ్డలి వేటు జగనాసుర రక్త చరిత్ర అని అందరికి అర్థమైంది. రాజధాని పై కోర్టు తీర్పు చరిత్రలో నిలిచిపోతుంది. ప్రభుత్వం ఎన్ని అరాచకాలు చేసినా రైతులు శాంతియుతంగా పోరాడి విజయాన్ని సాధించారు. ఇది ముమ్మాటికీ రైతుల విజయమే. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు న్యాయ వ్యవస్థను కించపర్చడం మాని తీర్పుని గౌరవించి అమరావతిని అభివృద్ధి చెయ్యాలి. జడ్జీలను సైతం కించపరిచే విధంగా పోస్టులు పెట్టించింది వైసిపి ప్రభుత్వం. ఆ కేసులో వైసిపి నేతలు అరెస్ట్ అయ్యారు. మరోసారి వైసిపి నేతలు న్యాయ వ్యవస్థను తప్పు పడుతూ మాట్లాడుతున్నారని అన్నారు. న్యాయం రైతుల వైపు ఉంది కాబట్టే తీర్పు అనుకూలంగా వచ్చింది. మూడు ముక్కలాట మూర్ఖత్వాన్ని వీడి ఒకే రాష్ట్రం- ఒకే రాజధానికి వైసిపి కట్టుబడాలి. చెయ్యాల్సింది అభివృద్ధి వికేంద్రీకరణ... రాజధాని వికేంద్రీకరణ కాదని అన్నారు.మంగళగిరి టౌన్ మహిళలు, చిరు వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.విద్యుత్ బిల్లులు విపరీతంగా పెరిగిపోయాయి. వ్యాపారాలు దెబ్బతిన్నాయి. పెట్టుబడి పెరిగింది ఆదాయం తగ్గిందని తమ సమస్యలు లోకేష్ తో వ్యాపారస్తులు చెప్పుకున్నారు. లోకేష్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తరువాత చిరు వ్యాపారులకు ఊతం ఇచ్చేలా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇంటి పన్ను, చెత్త పన్ను , కరెంట్ బిల్లులు, ఇలా అన్ని పెరిగిపోయి బ్రతుకు భారంగా మారిందని తమ ఇబ్బందులు లోకేష్ కి మహిళలు ఏకరువు పెట్టారు. జగన్ రెడ్డి వచ్చిన తరువాత బాదుడే...బాదుడు ఎవరినీ వదలడం లేదు. ముక్కు పిండి ప్రజల నుండి పన్నులు వసూలు చేస్తున్నారు. అడ్డమైన కారణాలు చెప్పి సంక్షేమ కార్యక్రమాలు కట్ చేస్తున్నారు. అటెండెన్స్ పేరుతో అమ్మ ఒడి కట్ చేస్తున్నారు, కరెంట్ బిల్లు కారణం చూపి పెన్షన్ కట్ చేస్తున్నారు, ఇక రేషన్ కార్డులు భారీగా తొలగిస్తున్నారు. మంగళగిరి నియోజకవర్గంలో రోడ్ల దుస్థితి చూస్తుంటే బాధేస్తుంది. కనీసం గుంతలు పూడ్చే దిక్కు లేదు. మీ సమస్యల పరిష్కారం కోసం నేను పోరాడతాను. అర్హులైన వారికి పెన్షన్లు ఎందుకు కట్ చేసారని కలెక్టర్ గారికి లేఖ రాస్తే కొంత మందికి ఇప్పుడు పెన్షన్ తిరిగి ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారు. స్థానిక సమస్యల పై పోరాటాన్ని ఉదృతం చేస్తాం. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్క ఇల్లు పేదలకు ఇళ్ళు నిర్మించలేదు పైగా మంగళగిరి లో పేదల ఇళ్లు అడ్డగోలుగా కూల్చేస్తునారు. సీఎం ఇంటి చుట్టుపక్కల పేదలు నివసించే హక్కు లేదనడం అత్యంత బాధాకరమని అన్నారు.

## ఏసీబీ వలలో దెందులూరు సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్

దెందులూరు మార్చి 4 కూచిపూడి శ్రీనివాస్, ఏ.ఈ, దెందులూరు సెక్షన్, పశ్చిమ గోదావరి జిల్లా అను నిందిత అధికారి, పిర్యాది అయిన శ్రీ గొల్లపల్లి గంగరాజు, దెందులూరు గ్రామం, మండలం, పశ్చిమ గోదావరి జిల్లా అతని చేపల చెరువు కి కమర్షియల్ ఎలక్ట్రికల్ మీటర్ బిగించటానికి గాను 50,000/- రూపాయలు లంచంగా అడిగి తీసుకుంటుండగా ఏలూరు ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు.ఇంకా ఎందరో ప్రభుత్వ జీతం తీసుకుంటూ లంచగొండి తనానికి పాల్పడుతున్న తిమింగలంను ఏసీబీ అధికారులు వలవేసి పట్టుకో వలసిందిగా మరియు ప్రజలకు ప్రజలు అన్ని రాష్ట్రాల జిల్లాల అన్ని ప్రాంతాల ఉన్నటువంటి తిమింగలాలను పట్టుకొనుటకు మీ వంతు సహాయ ఉండాలని కొందరు వాపోతున్నారు.

## 9 మంది వైసీపీ ఎంపీలు, 49 మంది ఎమ్మెల్యేలు వేరే పార్టీలతో టచ్‌లో ఉన్నారు

అమరావతి మార్చ్ 4 సినీ నటుడు శివాజీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీకి అమరావతి ఒక్కటే రాజధాని అని చెబుతూ వస్తున్న తాజాగా 9 మంది వైసీపీ ఎంపీలు, 49 మంది ఎమ్మెల్యేలు వేరే పార్టీలతో టచ్‌లో ఉన్నారంటూ బాంబ్ పేల్చారు. వ్యాపారులు రాజకీయాల్లోకి రావడం వల్లే అమరావతికి ఈ పరిస్థితి దాపురించిందన్నారు. కేంద్రానికి మెజార్టీ ఉంది కదా అని హక్కులను వదిలేస్తారా? అని శివాజీ ప్రశ్నించారు. ఈ రోజుల్లో కూడా కులం గురించి ఎందుకు మాట్లాడుతున్నారని శివాజీ నిలదీశారు.

## మున్సిపల్ కార్మికుల మానవహారం

విశాఖపట్నం రాష్ట్ర ప్రభుత్వం 11వ పిఆర్సి ద్వారా ఉద్యోగులను దగా చేసిందని , ప్రత్యేకించి మున్సిపల్ కార్పొరేషన్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు నామమాత్రపు జీతాలు పెంచి చేతులు దులుపుకోవడం జరిగిందని మున్సిపల్ కార్మికుల యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు అన్నారు. జీవీఎంసీ కాంట్రాక్టర్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు పి ఆర్ సి ప్రకారం 20 వేల రూపాయలు జీతం చెల్లించాలని కోరుతూ జీవీఎంసీ ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద నిరసన దీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మానవహారం జరిపారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో ను సవరించి మెరుగైన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా అన్ని జిల్లా కేంద్రాలలో దీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే అన్ని సంఘాలను కలుపుకొని ఉద్యమం ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

## అవయవ దానాలు చేసిన బాధిత కుటుంబికులు

కాకినాడ అకాల మరణం పొందిన యువతి అవయవ దానానికి ఆ కుటుంబం ముందుకొచ్చింది. దీంతో ఆమె రెండు కిడ్నీలను కాకినాడకు ఒకటి, విశాఖకు మరొకటి తరలించి రెండు నిండు ప్రాణాలను కాపాడారు తూర్పుగోదావరి జిల్లా వైద్యులు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రిలో ఫార్మాసిస్టా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యేశ్వరి ఈ నెల 28వ తేదీన రోడ్డు ప్రమాదానికి గురైంది. తీవ్రగాయాలైన ఆమె బ్రెయిన్ డెడ్కు గురైనట్లు వైద్యులు నిర్ధారించడంతో.. ఆ యువతి అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. యువతికి సంబంధించిన రెండు కిడ్నీల్లో ఒకటి ట్రస్ట్ హాస్పిటల్ ద్వారా కాకినాడకు చెందిన రామకృష్ణారెడ్డికి అమర్చగా.. రెండో కిడ్నీ విశాఖపట్నం ఆరిలోవలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అవయవాలను తరలించేందుకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి.. హైవే మొబైల్ వాహనం, నైట్ పెట్రోలింగ్ సిబ్బందితో గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేసి ఎస్పీ రవీంద్రనాథ్ బాబు ప్రత్యేక బందోబస్తు కల్పించారు.

## శ్రీకనకమహాలక్ష్మీ ఆలయ ఈవోగా శాంతి

శ్రీకాకుళం ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఇన్ చార్జిఈవోగా శాంతి భాద్యతలు చేపట్టారు.విశాఖ దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ గా కొనసాగిన శాంతికి నగరంలోని కనకమహాలక్ష్మి ఆలయ ఇన్ చార్జి ఈవోగా రావడం చర్చనియాంశంగా మారింది.ఈ ఆలయ ప్రస్తుత ఈవోకు ఎలాంటి పోస్టింగూ ఇవ్వకుండానే బదిలీ చేసిన ప్రభుత్వం అక్కడ శాంతికి అదనపు బాధ్యతలు అప్పగించింది.విశాఖ ఏసీ శాంతి గతేడాది తన పై అధికారి అయిన డిప్యూటీ కమిషనర్ పుష్పవర్ధన్ మొఖంపై ఇసుక కొట్టి సంచలనం రేపారు.ఇప్పుడు అదే అధికారికి ఆలయ ఈవోగా ఇన్ చార్జి భాద్యతలు అప్పగించడం అధికారుల్లో చర్చకు దారి తీసింది.ఇన్ చార్జి ఈవోగా వచ్చిన ఆమేకి అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.ఆమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భాద్యతలు చేపట్టారు.

## ఎస్వీ శిల్పకళాశాలలో ముగిసిన శిల్పాల ప్రదర్శన

### పలు ప్రాంతాల భక్తుల సందర్శన

తిరుపతి, టిటిడి ఆధ్వర్యంలో తిరుపతిలో ఉన్న శ్రీ వేంకటేశ్వర సంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్పశిక్షణ సంస్థలో ఫిబ్రవరి 26 నుండి ఆరు రోజుల పాటు నిర్వహించిన శిల్పాల ప్రదర్శన, అమ్మకం గురువారం ముగిసింది. జెఈవో(ఆరోగ్యం మరియు విద్య) శ్రీమతి సదా భార్గవి పర్యవేక్షణలో ఈ ప్రదర్శన జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల భక్తులు ఈ ప్రదర్శనను సందర్శించారు. శిల్పకళాశాల విద్యార్థులు రూపొందించిన దేవాలయ విమానాలు, మండపాలు, గోపురాలు, శిలాశిల్పాలు, సుధాశిల్పాలు, దారుశిల్పాలు, పంచలోహ శిల్పాలు, సంప్రదాయ వర్ణచిత్రాలు, సంప్రదాయ కలంకారి వర్ణచిత్రాలను ప్రదర్శించడంతోపాటు విక్రయానికి ఉంచారు. ఈ ఆరు రోజుల్లో మొత్తం 10,157 మంది ఈ ప్రదర్శనను సందర్శించారు. విద్యార్థులు తయారుచేసిన పలు కళాకృతులను సందర్శకులు విరివిగా కొనుగోలు చేశారు. ఈ ప్రదర్శనను పలువురు టిటిడి బోర్డు సభ్యులతోపాటు అన్ని విభాగాల అధికారులు, తిరుపతిలోని ప్రముఖులు, టిటిడి విద్యాసంస్థలు, ఇతర విద్యాసంస్థల విద్యార్థులు, టిటిడి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, శిల్ప కళాశాల పూర్వ విద్యార్థులు సందర్శించారు.

## గిద్దలూరు జాతీయ రహదారిపై అవగాహన ర్యాలీ

### నంద్యాల వన్యప్రాణి విభాగం డి ఎఫ్ ఐ వినీత్ కుమార్

గిద్దలూరు మార్చి 04 ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం 2022 సందర్భంగా నంద్యాల వన్యప్రాణి విభాగం డిఎఫ్ఓ నంద్యాల వినీత్ కుమార్ ఐ.ఎఫ్.ఎస్ ఆధ్వర్యంలో . నంద్యాల - గిద్దలూరు జాతీయ రహదారిపై వాహన చోదకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో వినీత్‌కుమార్ మాట్లాడుతూ, వన్యప్రాణుల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసారు, నల్లమల అడవుల్లో వాహనాలు నడుపుతున్నప్పుడు వన్యప్రాణులు నిత్యం రోడ్డు దాటుతున్నందున బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఇటీవల రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో వాహనాలను అతివేగంగా నడపడం వల్ల చిరుతపులి, జింకలు మృత్యువాతపడుతున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు డ్రైవర్లకు ఈ అవగాహన తప్పనిసరి. నల్లమలై కొండల్లోని సహజసిద్ధమైన అడవుల్లో ఇటువంటి రోడ్డు ప్రమాదాలను జరగకుండా నిరోధించడానికి అటవీ శాఖ ఆర్ అండ్ బి శాఖ, ఎన్ హెచ్ ఏ ఐ మొదలైన వాటితో పాటు నివారణ చర్యలు తీసుకుంటోంది. వన్యప్రాణి ప్రేమికురాలు శ్రీమతి రూపక్ రోడ్డుపై టైగర్ పగ్‌మార్క్‌లను పెయింట్ చేస్తూ ప్రత్యేక సందేశాన్ని అందించారు. అడవిలో ప్రయాణించే రోడ్లు తమ ఇల్లు కాబట్టి జంతువులకు మొదటి హక్కు ఉందని డ్రైవర్లకు సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో చెల్మ ఈశ్వరయ్య, ఎఫ్‌బీవో పాచెర్ల, పాచెర్ల సీబీఈటీ సిబ్బంది, పాచెర్ల గ్రామస్తులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా వేదికగా ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

## టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎన్.ఎమ్.డి ఫారూక్

నంద్యాల మార్చి 04 ( విభారె) టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎన్.ఎమ్.డి ఫారూఖ్ టీడీపీ నంద్యాల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎన్.ఎమ్.డి ఫిరోజ్ మాజీ శాసనసభ సభ్యులు భూమా బ్రహ్మానంద రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలుపడం జరిగిందని తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా విభాగం అయిన ఐ.టీడీపీ నంద్యాల పట్టణ అధ్యక్షుడిగా మహమ్మద్ అలీ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నాయకులు తమపై నమ్మకంతో ఐ. టీడీపీ నంద్యాల పట్టణ అధ్యక్షుడిగా నియమించి పెంచారని ఈ కర్తవ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పార్టీ కోసం కష్ట పడతానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎన్.ఎమ్.డి ఫారూఖ్ వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను సోషల్ మీడియా వేదికగా ఎండగట్టి ప్రజలకు తెలియచేయాలన్నారు. నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతూ, తెలుగుదేశం పార్టీ విజయంలో సోషల్ మీడియా సభ్యులు కీలకపాత్ర పోషించాలన్నారు ప్రభుత్వాన్ని ప్రశ్నించే విధంగా,హుందాగా ప్రజల మన్ననలు పొందే విధంగా సోషల్ మీడియా పోస్టులు మాత్రమే టీమ్ సభ్యులు పోస్టులు ఉండాలన్నారు. భవిష్యత్తులో సోషల్ మీడియాను గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# అద్దంకి రోడ్డు కు శిలాఫలకం ఆవిష్కరణ చేసిన మద్దిశెట్టి

దర్శి మార్చి 04 ( విభారె) ప్రకాశం జిల్లా దర్శి లో శుక్రవారం దర్శి శాసనసభ్యులు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ దర్శి నుండి అద్దంకి వెళ్ళు రోడ్డు మరమ్మత్తుల నిమిత్తం శంకుస్థాపన చేశారు. వేదమంత్రాలు తో పురోహితులు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ చే పూజలు చేయించి తదుపరి శిలపలఖం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు వేణుగోపాల్ మాట్లాడుతూ దర్శి 0.8 నుండి శంకరాపురం వద్ద 26.0 కిలోమీటర్స్ వరకు మరమ్మత్తులు జరుగుతుంది అని తెలిపారు. ఈ రోడ్డు నిమిత్తం 6కోట్ల 20లక్షలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఇంకాదర్శి నుండీ పొదిలి వరకు రోడ్డు కూడా త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. తదుపరి దర్శి నుండీ కురిచేడు సాగర్ కాలువ వరకు కూడా రోడ్డు ప్రారంభిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు వేణుగోపాల్ ను, ఎంపీపీ ని స్థానిక వైసీపీ నాయకులు శాలువాలు కప్పి ఘజ మాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమం లో దర్శి ఎంపీడీఓ,తహసీల్దార్, ఎంపీపీ , వైస్ ఎంపీపిలు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్,దర్శి సింగిల్ విండో అధ్యక్షులు,నగర పంచాయతీ కౌన్సిలర్స్,వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లా దరఖాస్తులను 11 కేటగిరీలుగా విభజించి నివేదికలు సిద్ధం చేయండి



కర్నూలు మార్చి 04 నూతనంగా ఏర్పాటు కాబోతున్న నంద్యాల జిల్లాలో విలీనమయ్యే ప్రాంతాలకు సంబంధించి జిల్లా స్థాయి అభ్యంతరాలు, సూచనల కమిటీకి 126 దరఖాస్తులు వచ్చాయని వీటిని 11 కేటగిరీలుగా విభజించి నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు సంబంధిత కమిటీ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని కమాండ్ కంట్రోల్ రూమ్ లో జిల్లా స్థాయి అభ్యంతరాలు, సూచనల కమిటీ సభ్యులతో కలెక్టర్ సమావేశమయ్యారు. జాయింట్ కలెక్టర్ (రెవెన్యూ మరియు రైతు భరోసా) రామసుందర్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ వెంకటసుబ్బయ్య, సిపిఓ అప్పల

### అభ్యంతరాలు, సలహాలపై ప్రత్యేక నివేదిక రూపొందించండి

### జిల్లా శాఖల వారీగా ఉద్యోగుల జాబితా సిద్ధంగా ఉంచుకోవాలి

### జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు

కొండయ్య తదితర పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు మాట్లాడుతూ నంద్యాల నూతన జిల్లా ఏర్పాటుకు సంబంధించి ఇప్పటివరకు స్వీకరించిన 126 దరఖాస్తులను 11 కేటగిరీలుగా విభజించి నివేదికలను సిద్ధం చేయాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. ఈరోజు (గురువారం)సాయంత్రం వరకు మరిన్ని దరఖాస్తులు వస్తాయని స్వీకరించిన దరఖాస్తులన్నింటిని పూర్తిగా అధ్యయనం చేసి అభ్యంతరాలు, సలహాలపై ప్రత్యేక నివేదిక రూపొందించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా మ్యాప్ ను తయారు తయారు చేయడంతో పాటు డివిజన్... డివిజన్ సంబంధించిన అన్ని మండలాలు ఒకే కలర్ లో ఉండేలా సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి ఒక కలర్ ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. స్వీకరించిన దరఖాస్తుల్లో అభ్యంతరాలు తెలిపిన ప్రదేశం నుండి జిల్లా కేంద్రానికి ఎంత దూరం ఉంటుందో సంబంధిత దూరాన్ని కిలోమీటర్ల సహా పొందుపరచాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని డిపార్ట్మెంట్లు శాఖల వారీగా పని చేస్తున్న ఉద్యోగుల (క్యాడర్ స్ట్రెంత్) జాబితాను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సీనియర్ అసిస్టెంట్ అధికారి స్థాయి నుండి జోనల్ సీనియారిటీగా వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు.

# కేంద్ర పథకాల అమలులో నెల్లూరు జిల్లా టాప్

### -ఎంపీ ఆదాల ప్రశంస

నెల్లూరు మార్చి 04 ( విభారె) కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో అమలయ్యే పథకాల్లో నెల్లూరు జిల్లా అగ్రస్థానంలో ఉందని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి ప్రశంసించారు. జిల్లా మౌలిక సదుపాయాల కల్పన సలహామండలి (దిశ) సమావేశం శుక్రవారం కలెక్టరేట్లోని తిక్కన భవన్లో జరిగింది. దీనికి నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. కలెక్టర్ చక్రధర్ బాబు, మేయర్ పొట్లూరు స్రవంతి సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో ఎంపీ ఆదాల మాట్లాడుతూ 43 అంశాలను ఈ సమావేశంలో సమీక్షించినట్లు తెలిపారు. ప్రతి 3 నెలలకు ఒకసారి జరగాల్సిన ఈ సమావేశం కోవిడ్ కారణంగా గత 6 నెలలుగా జరగలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు ఆయా పథకాల ద్వారా ఏ మేరకు సద్వినియోగం అయ్యాయి, ఇంకే సమస్యలు ఉన్నాయనే విషయం గా సమీక్షించినట్లు చెప్పారు. ముఖ్యంగా ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ పనుల్లో కోటి 18 లక్షల పనిదినాలను కల్పించి దేశంలోనే నెల్లూరు జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని ప్రశంసించారు. అదేవిధంగా పి.ఎం.ఏ.జి.వై పథకం కింద ఎస్సీ ,ఎస్టీ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో జిల్లా రెండో స్థానం సాధించిందని పేర్కొన్నారు. 160 గ్రామాలలో డ్రోన్ ద్వారా సర్వే చేసి జిల్లా దేశంలోనే ముందంజలో ఉందని తెలిపారు. స్వచ్ఛ పర్యవేక్షక ర్యాంకింగ్లో నెల్లూరు నగర పాలక సంస్థ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచి 10 కోట్ల రూపాయల నగదు బహుమతిని సాధించడం గర్వించదగిన విషయమని కితాబునిచ్చారు. పీ.ఎం కిసాన్ అమలులో జాతీయ అవార్డు లభించిందని పేర్కొన్నారు. రైతులు రైతు భరోసా మొత్తాలను సకాలంలో అందించడం ద్వారా ఈ అవార్డు దక్కిందని తెలిపారు. కోవిడ్ నివారణ చర్యల్లో కూడా మన జిల్లా ముందంజలో ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా వ్యాక్సినేషన్ లో నెంబర్వన్ స్థానాన్ని సాధించిందని ప్రశంసించారు. వెయ్యి మందికి పైగా ప్లాస్మా చికిత్స అందించామని, కోటి ఎనభై ఐదు వేల మందికి కోవిడ్ చికిత్సను అందించినట్లు తెలిపారు. ఉక్రెయిన్ లో ఉన్న 25 మంది విద్యార్థుల్లో ఇప్పటికే 11 మంది జిల్లాకు చేరారని, మిగతా వారిని కూడా రప్పించేందుకు జిల్లా కలెక్టర్ కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకొని పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లాను పలు పథకాల అమలులో అగ్రస్థానంలో ఉంచిన జిల్లా కలెక్టర్ ఇతర అధికారులకు తన అభినందనలు మనస్ఫూర్తిగా తెలిపారు.డ్వామా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జేసి గణేష్ నాయక్ అధికారులను పర్యవేక్షించారు. ఎంపీ విలేకర్ల సమావేశంలో విజయ డైరీ చైర్మన్ రంగారెడ్డి, జడ్పిటిసి మల్లు సుధాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వర్ణ వెంకయ్య, పాముల హరి ప్రసాద్, శ్రీధర్ రెడ్డి, నరసింహారావు , మైపాడు అల్లాబక్షు, మధు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో సామాన్య భక్తులకు ప్రాధాన్యత

### శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శనాల ధరలు పెంచలేదు

### భక్తుల రద్దీకి అనుగుణంగా రుచికరమైన అన్నప్రసాదాలు

### టిటిడి ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి

తిరుమల మార్చి 04 ( విభారె) తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యవంతమైన దర్శనం, రుచికర అన్నప్రసాదాలు అందించనున్నట్లు టిటిడి ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి తెలిపారు. తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, పిఏసి – 4 (పాత అన్నప్రసాద భవనం) లోని లగేజి సెంటర్ను శుక్రవారం ఉదయం అధికారులతో కలిసి ఛైర్మన్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ కోవిడ్ కారణంగా దాదాపు రెండు సంవత్సరాల తరువాత సామాన్య భక్తులకు సర్వదర్శనం ప్రారంభించి పదిరోజులవుతోందన్నారు. సర్వదర్శనం ప్రారంభమైన తరువాత తిరుమలలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగిందన్నారు. పెరిగిన భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాదం వద్ద ఎలాంటి ఇబ్బంది లేకుండా అల్పాహారం, అన్నప్రసాదాలు అందించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఉత్తర భారతదేశం నుండి వచ్చే భక్తులకు భోజనంతో పాటు రొట్టెలు, చపాతీలను అందిస్తామన్నారు. తిరుమలలోని మరో రెండు ప్రాంతాల్లో అన్నప్రసాదాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీవారి ఆలయంలో ఆర్జిత సేవలను పునఃప్రారంభించేందుకు సమయం పడుతుందని, ఏప్రిల్ నుంచి అన్ని సేవలను ప్రారంభించేందుకు అధికారులు ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు సామాన్య భక్తులకు అందించే ఆర్జిత సేవలు, దర్శనాల ధరలను టిటిడి పెంచలేదని,పెంచే ఆలోచన ఇప్పట్లో లేదన్నారు. ధరల పెంపుపై కేవలం చర్చ మాత్రమే పాలకమండలిలో జరిగిందన్నారు. సామాన్య భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించడమే టిటిడి పాలకమండలి ముఖ్య ఉద్దేశమని, ఇందులో భాగంగా ఇప్పటికే శుక్ర, శని, ఆదివారాల్లో విఐపి దర్శనాలను రద్దు చేశామని, దీని వల్ల సర్వదర్శనం టోకెన్లు పొందే సామాన్య భక్తులకు అదే రోజు దర్శనం జరుగుతోందని సుబ్బారెడ్డి వివరించారు. కొండ మీద ఆహారం విక్రయించరాదని బోర్డు తీసుకున్న నిర్ణయం వల్ల ఎవరి ఉపాధికి ఇబ్బంది కలగని విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.



# యూఎస్ బాక్సాఫీస్ లో కొత్త ట్రెండ్..!



కరోనా నేపథ్యంలో ఓవర్ సీస్ మార్కెట్ కుదేలైపోయింది. అయితే ఇప్పుడిప్పుడే మళ్ళీ మెల్లగా పుంజుకుంటోంది. ఇప్పటి వరకు బిగ్ స్టార్ హీరోల చిత్రాలను చూడటానికి యూఎస్ఏలోని సినీ ప్రేమికులు ఆసక్తి చూపించేవారు. అయితే ఇటీవల కాలంలో పాటలు మరియు ట్రైలర్ తో మంచి బజ్ క్రియేట్ చేసిన చిన్న సినిమాలను కూడా ఆదరిస్తున్నారు.ప్రమోషనల్ కంటెంట్ తో మూవీ లవర్స్ దృష్టిని ఆకర్షించిన 'డీజే టిల్లు' చిత్రం యునైటెడ్ స్టేట్స్ లో మంచి వసూళ్ళు రాబట్టింది. అలానే 'భీమ్లా నాయక్' సినిమా కూడా సాలిడ్ కలెక్షన్స్ అందుకుంటోంది. రాబోయే రోజుల్లో థియేటర్లలోకి రాబోతున్న బజ్ కలిగిన సినిమాలన్నీ యూఎస్ బాక్సాఫీస్ వద్ద ప్రభావం చూపే అవకాశం ఉంది.అక్కడ గురువారం ప్రదర్శించే ఎర్లీనూన్ ప్రీమియర్ షోలకు వచ్చే ఫస్ట్ టాక్ ని బట్టే సినిమాకు వచ్చే ఓపెనింగ్స్ ఆధారపడి ఉంటాయి. మొదటి షో టాక్ డీసెంట్ గా ఉంటే ప్రీమియర్ సేల్స్ మరియు అడ్వాన్స్ బుకింగ్స్ పెంచడంలో సహాయపడుతుంది.శర్వానంద్ – రష్మిక మందన్నా కలిసి నటించిన 'ఆడవాళు మీకు జోహార్లు' సినిమా ప్రీమియర్లు ఈ వారం వేయబోతున్నారు. ఇదే క్రమంలో 'రాధేశ్యామ్' 'ఆర్.ఆర్.ఆర్' 'కేజీఎఫ్ 2' 'ఆచార్య' 'ఎఫ్ 3' 'సర్కారు వారి పాట' వంటి పలు పెద్ద చిత్రాల ఎర్లీ ప్రీమియర్ షోలు పడబోతున్నాయి.యూఎస్లో ఎర్లీ ప్రీమియర్ అంటే దాదాపు 12 గంటలకు షోలు ప్రారంభమవుతాయి. 3 – 4 గంటలకల్లా టాక్ మరియు రివ్యూలు వచ్చేస్తాయి. గతంలో యుఎస్ ప్రీమియర్లు 5–6 గంటలకు ప్రదర్శించబడేవి. మూడు గంటల తర్వాత టాక్ మరియు రివ్యూలు వచ్చేవి.ఎర్లీ నూన్ ప్రీమియర్ల ట్రెండ్ ఇకపై అన్ని చిత్రాలకూ కొనసాగే అవకాశం ఉందని డిస్ట్రిబ్యూషన్ సర్కిల్స్ నుండి టాక్ వినిపిస్తోంది. రాబోయే పెద్ద సినిమాలతో పాటుగా పలు మీడియం రేంజ్ చిత్రాలు – క్రేజీ సినిమాలు యూఎస్ లో భారీ వసూళ్లు అందుకునే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ప్రేమకీ విధికీ మధ్య జరిగే యుద్ధం 'రాధేశ్యామ్'

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన భారీ ఎంటర్ టైనర్ 'రాధేశ్యామ్'. దాదాపు మూడున్నరేళ్ల విరామం తరువాత ప్రభాస్ నుంచి వస్తున్న సినిమా ఇది. అయితే పాన్ ఇండియా స్థాయికి మించి ఇండియన్ స్క్రీన్ పై అత్యంత భారీ బడ్జెట్ తో తెరకెక్కిన ఈ చిత్రంపై ప్రపంచ వ్యాప్తంగా భారీ అంచనాలు




నెలకొన్నాయి. రాధాకృష్ణ కుమార్ భారీ ఆశలు పెట్టుకున్న ఈ మూవీని యువీ క్రియేషన్స్ టి సిరీస్ సంస్థలు దాదాపు 400 కోట్ల భారీ బడ్జెట్ తో నిర్మించాయి. చాలా కాలంగా ప్రభాస్ అభిమానులతో పాటు సగటు సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ మూవీ ఎట్టకేలకు మార్చి 11న ప్రేక్షకుల ముందుకు రాబతోంది.రిలీజ్ డేట్ దగ్గరపడటంతో చిత్ర బృందం ప్రమోషన్స్ ని ప్రారంభించేసింది. ఇటీవల లిరికల్ వీడియోని విడుదల చేసిన ఇచత్ర బృందం మార్చి 2 నుంచి అసలు ప్రమోషన్స్ కి తెరలేపబోతున్నామంటూ ఇండైరెక్ట్ గా ప్రకటించింది. ఇదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు రిలీజ్ ట్రైలర్ తో 'రాధేశ్యామ్' ప్రమోషన్స్ ని ప్రారంభించింది. ముంబైలో గ్రాండ్ గా ఏర్పాటు చేసిన ఈవెంట్ లో 'రాధేశ్యామ్' రిలీజ్ ట్రైలర్ ని విడుదల చేశారు. ఈ ఈవెంట్ లో హీరో ప్రభాస్ హీరోయిన్ పూజా హెగ్డే ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.'మనం ఆలోచిస్తున్నామని భ్రమపడతాం... మన ఆలోచనలు కూడా ముందే రాసుంటాయి.. అంటూ ప్రభాస్ వాయిస్ తో టెర్రిఫిక్ విజువల్స్ తో రిలీజ్ ట్రైలర్ మొదలైంది. చెయి చూసి ఫ్యూచర్ ని.. వాయిస్ విని పాస్ట్ ని కూడా చెప్పేస్తావా?.. అని సచిన్ ఖేకేదర్ చెబుతున్న డైలాగ్ లు... ఈనె ఎలా ఎప్పుడు చనిపోతాడో చెప్పనా... నాకు రెండోసారి చూసే అలవాటు లేదు.. అంటూ ప్రభాస్ చెబుతున్న తీరు ప్రేమ విషయంలో ఆదిత్య ప్రిడిక్షన్ తప్పు... అని పూజా హెగ్డే పాత్ర తో చెప్పించిన డైలాగ్ లు ... ట్రైలర్ చివర్లో 'ప్రేమకీ విధికీ మధ్య జరిగే యుద్ధమే .. 'అంటూ దర్శక ధీరుడు రాజమౌళి అందించిన వాయిస్ ఓవర్ వెరసి 'రాధేశ్యామ్' రిలీజ్ ట్రైలర్ స్పెక్టాకులర్ గా వుంది.ఒక విధంగా ఈ ట్రైలర్ లో కథని మొత్తం చెప్పే ప్రయత్నం చేశాడు దర్శకుడు. ట్రైన్ ట్రాక్ తప్పిన తీరు.. సముద్రంలో ఓడ మునిగిపోతున్న దృశ్యాలు ప్రేక్షకులని సరికొత్త లోకంలో విహరిస్తున్న ఫీల్ ని కలిగించేలా వున్నాయి. మేకర్స్ ముందు నుంచి చెబుతున్నట్టుగానే సునామీ నేపథ్యంలో చిత్రీకరించిన పతాక ఘట్టాలు సినిమాకు ప్రధాన హైలైట్ గా నిలవనున్నాయి. యూరప్ నేపథ్యంలో సాగే హెరిటేజ్ పిరియాడిక్ రొమాంటిక్ లవ్ డ్రామాగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు ఓ విజువల్ వండర్ గా కనువిందు చేయడం కాయంగా కనిపిస్తోంది.ఇండియన్ ఎమర్జెన్సీ కాలాన్ని ముందే చెప్పి షాకిచ్చిన ఓ ప్రముఖ పాలమిస్ట్ ప్రేమకథగా ట్రైలర్ లో హింట్ ఇచ్చారు. ప్రెసిడెంట్ లతో పాటు ప్రధానికి కూడా హస్తం చూసి జరగబోయేది చెప్పే యువకుడిగా ఇందులో ప్రభాస్ కనిపించబోతున్నట్టు తెలుస్తోంది. ఇంతకు ముందు విడుదలైన ట్రైలర్ ఈ విషయాల్ని ముందే స్పష్టం చేసినా తాజా ట్రైలర్ లో చిత్ర కథని దాదాపుగా రివీల్ చేయడం.. విధిని ఎదరించి ప్రేమని దక్కించుకున్న యువకుడిగా ప్రభాస్ ని చూపించిన తీరు.. ఓడ మునిగిపోతుంటే అబ్బుర పరిచే స్థాయిలో ప్రభాస్ చేస్తున్న విన్యాసాలు సినిమా ఓ రేంజ్ లో వుండబోతోందనే సంకేతాల్ని అందిస్తోంది. మార్చి 11న విడుదల కానున్న ఈ మూవీ ఊహలకందని స్థాయిలో ప్రపంచ వ్యాప్తంగా రికార్డులు సృష్టిస్తుందా? అన్నది వేచయి చూడాల్సిందే.

# షాకుల మీద షాకులిస్తున్న నాగచైతన్య

టాలీవుడ్ లో మన హీరోలు మునుపెన్నడూ లేనంతగా స్పీడుని ప్రదర్శిస్తున్నారు. గతంలో ఏడాదికి ఒకటి రెండు ప్రాజెక్ట్ లకే పరిమితమై మరో ప్రాజెక్ట్ ని చేయడానికి అంగీకరించని మన హీరోలు ఇప్పుడు ఎడాపెడా వరుస చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తున్నారు.ఒక సినిమా సెట్ పై వుండగానే మరో సినిమాని థియేటర్లలోకి దించేస్తున్నారు. చేతి నిండా సినిమాలతో క్షణం తీరిక లేకుండా బిజీ బిజీగా గడిపేస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి నుంచి చిన్న హీరోల వరకు ఇదే జోరుని చూపిస్తూ చేతినిండా సినిమాలతో బిజీగా గడిపేస్తున్నారు.ఇప్పుడు ఈ జాబితాలోకి యంగ్ హీరో నాగచైతన్య కూడా చేరిపోయారు. ఇటీవలే కింగ్ నాగార్జున తో కలిసి రొమాంటిక్ యాక్షన్ ఎంటర్ టైనర్ 'బంగార్రాజు' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చిన నాగచైతన్య ఈ మూవీ తరువాత బ్యాక్ టు



బ్యాక్ సినిమాలతో షాకుల మీద షాకులు ఇవ్వడం మొదలుపెట్టారు. ప్రస్తుతం 'మనం' ఫేమ్ విక్రమ్ కె. కుమార్ డైరెక్షన్ లో 'థాంక్యూ' మూవీలో నటిస్తున్న విషయం తెలిసిందే. దిల్ రాజు అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ మూవీ చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది.ఈ నేపథ్యంలో తాజాగా వెబ్ సిరీస్ ని పట్టాలెక్కించాడు. విక్రమ్ కె. కుమార్ ఈ వెబ్ సిరీస్ ని డైరెక్ట్ చేస్తున్నారు. మంగళవారం మహా శివరాత్రి సందర్భంగా తన కొత్త ప్రయాణం మొదలైందంటూ ఓ బ్లాక్ అండ్ వైట్ ఫొటోని సోషల్ మీడియా ఇన్ స్టా వేదికగా అభిమానులతో పంచుకుని సర్ ప్రైజింగ్ షాకిచ్చారు నాగచైతన్య. 'దూత' పేరుతో రూపొందుతున్న ఈ వెబ్ సిరీస్ ని అమెజాన్ ప్రైమ్ నిర్మిస్తోంది. మొత్తం 10 భాగాలుగా రూపొందనున్న ఈ సిరీస్ సైకలాజికల్ థ్రిల్లర్ గా రూపొందనుందని ఇందులో చై నెగెటివ్ ఛాయలున్న పాత్రలో నటిస్తున్నారని ఇప్పటికే వార్తలు వినిపిస్తున్నాయి.ఇదిలా వుంటే తాజాగా నాగాచైతన్య మరో షాకింగ్ న్యూస్ చెప్పడం ఆసక్తికరంగా మారింది. తమిళంలో విభిన్న చిత్రాల దర్శకుడిగా పేరు తెచ్చుకున్న వెంకట్ ప్రభు డైరెక్షన్ లో నాగచైతన్య తాజాగా ఓ భారీ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా తెలిసింది. ఇదొక పిరియాడిక్ యాక్షన్ డ్రామా అని 1990'ల నేపథ్యంలో ఈ చిత్ర కథ సాగుతుందని తెలుస్తోంది. ఇదొక ప్రేమకథ అని ఇందు కోసం దర్శకుడు వెంకట్ ప్రభు స్క్రిప్ట్ ని సిద్ధం చేస్తున్నారని చెబుతున్నారు.పిరియాడిక్ లవ్ స్టోరీ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో హీరో నాగచైతన్యకు జోడీగా బుట్టబొమ్మ పూజా హెగ్డే నటించనుందని ఇప్పటికే ఆమెని దర్శకుడు వెంకట్ ప్రభు సంప్రదించారని పూజా కూడా స్టోరీ నచ్చడంతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిందని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ ని త్వరలోనే మేకర్స్ అధికారికంగా ప్రకటించబోతున్నట్టుగా తెలిసింది. నాగచైతన్య ఇదే ఏడాది అమీర్ ఖాన్ నటించిన 'లాల్ సింగ్ చద్దా' చిత్రంతో బాలీవుడ్ కు పరిచయం అవుతున్న విషయం తెలిసిందే.

# ఎంతైనా వందో టెస్టు కదా.. ఆ మాత్రం ఉండాలి



టీమిండియా మెషిన్గన్ విరాట్ కోహ్లి మాములుగానే అగ్రెసివ్గా కనిపిస్తాడు. తన గంభీరమైన బ్యాటింగ్తో ప్రత్యర్థి బౌలర్లను భయపెట్టడంలో సిద్ధహస్తుడు. టీమిండియా కెప్టెన్గా ఎన్నోసార్లు తన అగ్రెసివ్నెస్తో అభిమానులను అలరించాడు. కోపం వచ్చినా.. సంతోషం వేసినా కోహ్లిని ఆపడం ఎవరి తరం కాదు. ఇక లంకతో జరుగుతున్న తొలి టెస్టు కోహ్లికి వందోదన్న సంగతి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వందో టెస్టు ఆడుతున్న కోహ్లి మాములుగా ఉంటే ఏం మజా వస్తుంది. అందుకే లంక్ బౌలర్ సురంగ లఖ్మల్ను తన స్టన్నింగ్ లుక్తో భయపెట్టాడు.విషయంలోకి వెళితే.. టీమిండియా ఇన్నింగ్స్ 27వ ఓవర్లో మూడో బంతిని కోహ్లి బౌండరీ తరలించాడు. నాన్స్ట్రైక్ ఎండ్వైపు వెళుతున్న కోహ్లిని బౌండరీ కొట్టావా అన్నట్లుగా లక్మల్ చూశాడు. అంతే ఒక్కసారిగా సీరియస్ మోడ్లోకి వెళ్లిపోయిన కోహ్లి.. వెనక్కి తిరిగి కోపంతో లక్మల్ను ఒక చూపు చూశాడు. ఆ చూపు లక్మల్ను భయపెట్టేలా ఉందనడంలో సందేహం లేదు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. వీలైతే మీరు ఒక లుక్కేయండి. ఇక తన వందో టెస్టులో కోహ్లి సెంచరీ చేస్తాడని భావించిన ఫ్యాన్స్కు నిరాశే మిగిలింది. 45 పరుగులతో మంచి ఇన్నింగ్స్ ఆడినప్పటికి దానిని పెద్ద ఇన్నింగ్స్గా మలవడంలో కోహ్లి విఫలమయ్యాడు. లసిత్ ఎంబుల్డేనియా బౌలింగ్లో ఒక సూపర్ డెలివరీకి కోహ్లి క్లీన్బౌల్డ్గా వెనుదిరగడం విశేషం.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190